

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	37.7	27.4
కావలి	35	28
ఆత్మకూరు	37	26
ఉదయగిరి	38	26
కందుకూరు	36	28



అమలులోకి వేట నిషేధం!

- ఒడ్డుకు చేరుతున్న పడవలు, వలలు
- ప్రభుత్వ సాయం కోసం మత్స్యకారుల ఎదురుచూపు

కడలిలో మత్స్య సంపద వృద్ధి నేపథ్యంలో రెండు నెలలపాటు వేట నిషేధం మంగళవారం నుంచి అమలులోకి వచ్చింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏప్రిల్ 15 నుంచి జూన్ 15వ తేదీ వరకు మత్స్యకారులెవరూ వేట కోసం సముద్రంలోకి వెళ్లకూడదు. ఈ నేపథ్యంలో పడవలను ఒడ్డుకు చేర్చారు. అలాగే వలలను భద్రపరుచుకున్నారు. అయితే వేట మాత్రమే మత్స్యకారులకు తెలిసిన విద్య కావడంతో ఇతర పనులు చేసుకునే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అందించే సాయం కోసం వారంతా ఎదురుచూస్తున్నారు. గతంలో కేవలం రోజుకు కిలో చొప్పున రెండు నెలలకు 60 కిలోల బియ్యం మాత్రం ఇచ్చే ప్రభుత్వం పలు దఫాలు తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడ్డాక నగదు సహాయం అందజేస్తోంది. ఈ క్రమంలో వేట విరామ భృతిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.10వేల నుంచి 20వేలకు పెంచారు. ఈ పెంపు మత్స్యకారులకు ఎంతో ఊరటనిస్తోంది. జిల్లావ్యాప్తంగా 18వేలకుపైగా మత్స్యకార కుటుంబాలు ఉండగా, అధికారులు 12,440 కుటుంబాలు ఉన్నట్టు లెక్క తేల్చి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఒక్కో కుటుంబానికి రూ.20వేలు చొప్పున రూ.24.88 కోట్లు జిల్లాకు రావాల్సి ఉంది. ఈ నిధుల కోసమే మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు. త్వరలో వేట విరామ భృతి అందజేసి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)



సముద్రంలో నుంచి ఒడ్డుకు చేరిన పడవలు



సురక్షిత ప్రాంతానికి ఎడ్లబండిపై వలలను తరలిస్తూ..



వలలను జాగ్రత్త చేసుకుంటున్న మత్స్యకారులు

ప్రతిభకు పురస్కారం!

- ముగ్గురికి 'కందుకూరి' అవార్డులు
- నేడు విజయవాడలో ప్రదానం

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు, రంగస్థల నటుడు కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతి సందర్భంగా కూటమి ప్రభుత్వం నాటక రంగంలో విశేష కృషి చేస్తున్న కళాకారులకు రాష్ట్ర, జిల్లాస్థాయి విశిష్ట పురస్కారాలను ప్రకటించింది. జిల్లాస్థాయి విశిష్ట పురస్కారాలను డాక్టర్ బద్రిపీర్‌కుమార్ (సాంఘికం), గంధం రాజేశ్వరి (పౌరాణికం), కనిమెల భానుమతి (చారిత్రకం) పురస్కారాలకు ఎంపికయ్యారు. బుధవారం సాయంత్రం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ విశిష్ట పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిల్మ్ టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రకటించింది.

చాలా సంతోషంగా ఉంది



26 సంవత్సరాలుగా నటుడిగా, రచయితగా, రంగస్థలం, టీవీ రంగాల్లో కళా సేవకు, నా నాటనా ప్రతిభకు ప్రభుత్వం ఇస్తున్న విశిష్ట పురస్కారం చాలా సంతోషంగా ఉంది. గూడూరు సన్నపరెడ్డి కృష్ణారెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాను. 1999 నుంచి నాటకాల్లో ప్రదర్శనలకు వెళుతున్నాను. ధ్రుతరాష్ట్ర కౌగిలి నాటకాన్ని 36సార్లు ప్రదర్శించి ఎన్నో అవార్డులు అందుకున్నా. లక్ష్యం నాటకాన్ని రాసి గుంటూరు నాటక పరిషత్‌లో ప్రదర్శించి ప్రథమ బహుమతిని సాధించాను.

- డాక్టర్ బద్రిపీర్‌కుమార్

ఊహించని పురస్కారం



కొంతమంది ప్రోత్సాహంతో కళాకారిణిగా అవార్డుకు దరఖాస్తు చేసుకున్నా. నేను ఊహించనే లేదు. కందుకూరి విశిష్ట అవార్డు వస్తుందని. నెల్లూరుకు చెందిన నేను చంద్రమతి, బాలనాగమ్మ, సత్యభామ, చింతామణిలో రాధ పాత్రల ద్వారా రాష్ట్రం నలుమూలల నటీమనిగా గుర్తింపు సత్కారాలు పొందాను. నా గురువులు చంద్రయ్య బాబాయి, నంద్యాల రత్నకుమార్‌లు పెట్టిన భిక్షాటన, కాశీనాయన చరిత్ర నాటకంలో 4 పాత్రలు పోషించి గుర్తింపు పొందాను. ఎనిమిదేళ్ల వయసులోనే హరికథలను గానం చేశాను. హరికథా కళాకారిణిగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ద్వారా సత్కారం పొందాను.

- గంధం రాజేశ్వరి

చాలాకాలానికి గుర్తింపు



కళాకారిణిగా నన్ను చాలాకాలం తర్వాత గుర్తించి కందుకూరి విశిష్ట పురస్కారం ఇస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మా అమ్మనాన్నలు కళాకారులు కావడంతో 3వ ఏటనుంచే రంగస్థల కళాకారిణిగా దాదాపు 8వేలకుపైగా నాటకాలలో నటించాను. బాల నటుడిగా బాలవర్ధి, లోహితాసుడు, హరిశ్చంద్ర పాత్రల్లో నటించాను. రంగస్థలనటిగా చంద్రమతి, చింతామణి, బాలనాగ మ్మగా నటిస్తూ ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందుకున్నా.

- కనిమల భానుమతి

రేపే ఐఏబీ!

నెల్లూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రెండో పంటకు నీటి కేటాయింపులు జరిపేందుకు ముహూర్తం ఖరారు అయ్యింది. ఈ నెల 17వ తేదీ గురువారం సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. నెల్లూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఐఏబీ సమావేశం ప్రారంభం కానుండగా, జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిదులు పాల్గొననున్నారు.

- 5.27 లక్షల ఎకరాల్లో రెండో పంట
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఇరిగేషన్ అధికారులు
- సాగుతోపాటు తాగునీటి కేటాయింపులపైనా నిర్ణయం

● మూడేళ్ల తర్వాత..

రెండో పంటకు ఐఏబీ నిర్వహిం చడం మూడేళ్ల తర్వాత ఇదే మొదటి సారి. ఈదఫా సోమశిల, కండలేరు జలాశయాల్లో నీరు పుష్కలంగా ఉండ డంతో రెండో పంట సాగు వీలవు తోంది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 5.27 లక్షల ఎకరాల్లో రెండో పంట సాగుకు నీటి కేటాయింపులు జరపాలని ప్రతిపాదిం చారు. సోమశిల కింద 3.70 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వను న్నారు. ఒక్కో టీఎంసీతో 8500-9వేల ఎకరాలు పండించేలా నిర్ణయించి 43 టీఎంసీలను కేటాయించనున్నారు. పెన్నా డెల్టాతోపాటు కావలి, కనుపూరు కాలువలు, ఉత్తర, దక్షిణ కాలువల కింద కూడా ఎంత మేర ఆయకట్టు సాగు జరగాలన్న దానిపై ప్రతిపాదనలు తయారు చేశారు. డెల్టాలో మొత్తం సాగు జరుగుతుండగా, మిగిలిన కాలువల కింద నిర్దేశిత ఆయకట్టు వరకూ నీరు ఇవ్వనున్నారు. అలానే కండలేరు జలాశయంలో రెండో పంటకు 16 టీఎంసీలను కేటాయించేలా టీజీపీ అధికారులు ప్రతిపాదించారు. ఈ నీటితో 1.57 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వనున్నారు. ఇందులో వరి పంటకు ఇచ్చే నీటితోపాటు ఆరుతడి పంటల స్థిరీకరణకు కూడా కేటాయింపులు ఉన్నాయి. కండ లేరు కింద ప్రస్తుత నెల్లూరు జిల్లా పరిధిలోని పొదలకూరు, మనుబోలు మండలాల్లో 33 వేల ఎకరాలకు నీరు అందించనుండగా, తిరుపతి జిల్లా పరిధిలో 1.27 లక్షల ఎకరాలకు నీరిచ్చేలా అధికారులు ప్రతిపాదించారు. సాగుతోపాటు ప్రజల దాహం తీర్చేందుకు కూడా సరిపడా నీటిని కేటాయించారు. ఈ కేటాయింపులపై ఐఏబీలో తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

● కాలువల కింద పనులా.. పంటా?

కాగా కొన్ని కాలువల ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. అటువంటి కాలువల కింద రెండో పంట ఉంటుందా? లేదా? అన్నది కొంత సందిగ్ధంగా మారింది. ప్రస్తుతం అధికారులు ఆయా పనులు చేస్తున్న కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్నారు. వారు పనులు చేసేందుకు ఆసక్తిగా ఉన్నారా? లేదా? అన్న విషయాన్ని తెలుసుకొని అధికారులు ఐఏబీ ముందుంచనున్నారు. అక్కడ ఈ కాలువల కింద కేటాయింపులపై నిర్ణయం తీసుకుంటారు.

గ్రామీణ ప్రాంతాల్లోని లింకు రోడ్ల అభివృద్ధికి పట్టిన గ్రహణం వీడటం లేదు. నాటి వైసీపీ ప్రభుత్వ పుణ్యమా అని నేటికీ ప్రజలకు గుంతల రోడ్ల నుంచి ఉపశమనం లభించడం లేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నిధులతో పంచాయతీరాజ్ రోడ్లను బాగు చేయనున్నట్లు నాటి పాలకులు ఆర్భాటంగా ప్రకటించారు. అయితే, కొంతమేర పనులు చేశాక రుణం మంజూరుకాక కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు. దీంతో అర్ధంత రంగా ఆగిపోయిన రోడ్ల పనులకు మోక్షం లభించడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఏఎంసీ రోడ్లకు పట్టిన గ్రహణం వీడలేదు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

బిల్లులు రాక.. పనులు కాక!



కొండాపురం : సాయిపేట-ఇస్కపాలెం మధ్య పంచాయతీరాజ్ రోడ్డు దుస్థితి

- ఏఎంసీ నిధులతో చేపట్టిన రోడ్లకు గ్రహణం
- 195 రోడ్లు.. రూ.155.6 కోట్ల బడ్జెట్
- రూ.30 కోట్ల మేర పనులు చేసిన కాంట్రాక్టర్లు
- బిల్లులు రాక అర్ధంతరంగా పనుల నిలిపివేత

రూ.1100 కోట్ల ఏఎంసీ నిధులతో పంచాయతీరాజ్ రోడ్లను బాగు చేస్తు న్నట్లు నాటి వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. ఏడాదిలో ఈ రోడ్లన్నీ అభివృద్ధి చెందుతాయని ప్రజలను నమ్మించింది. మొదటి దశలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో 195 రోడ్లను రూ.155.60 కోట్లతో అభివృద్ధి చేసే విధంగా పీఆర్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. మొత్తం 591 కిలోమీటర్ల రోడ్లను 34 ప్యాకేజీలుగా విభజించి 2022 జూన్‌లో తొలిసారిగా టెండర్లు పిలిచారు. అయితే బడ్జెట్ లేకపోవడంతో ఈ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. 4సార్లు టెండర్లు పిలిచినా ప్రయోజనం లేకుండా పోయింది. అయితే ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో హడావిడిగా కాంట్రాక్టర్ల చేత పనులు మొదలు పెట్టించారు. అప్పట్లో జిల్లావ్యాప్తంగా సుమారు రూ.30 కోట్ల మేర పనులు జరిగి ఉంటాయని అంచనా. చాలా రోడ్డు పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. కొన్ని చోట్ల డస్ట్ పోసి తారువేయకుండా వదిలేశారు.

● కోర్టుకు కాంట్రాక్టర్ల క్యూ

ఉమ్మడి జిల్లాలో కీలకమైన 195 రోడ్లను ఏఎంసీ నిధులతో అభివృద్ధి చేసేందుకు అనుమతించడంతో ఆ రోడ్లను వేరొక నిధులతో అభివృద్ధి చేయలేని పరిస్థితి నెలకొంది. అయితే ఈ రోడ్లను బాగు చేసేందుకు ఇప్పటికీ బడ్జెట్ కేటాయించలేదు. బ్యాంకుల నుంచి రుణం రాకపోగా, దీనిపై ప్రభుత్వం కూడా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఈ రోడ్లపై ప్రయాణిస్తున్న ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. మరోవైపు బిల్లుల కోసం కాంట్రాక్టర్లు హైకోర్టుకు క్యూ కడుతున్నారు. పలుమార్లు బిల్లులకై అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో కోర్టు మెట్లెక్కారు. ఇటీవల కావలి నియోజకవర్గంలో పనులు చేసిన ఓ కాంట్రాక్టర్‌కు రూ.2.97 కోట్లు చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. మరో కాంట్రాక్టర్‌కు రూ.2.14 కోట్లు చెల్లించాలని తీర్పునిచ్చింది. ఇవి కంటెంప్ట్ కేసులు కావడంతో ఏదో ఒక హెడ్ కింద ఈ బిల్లులు అప్‌లోడ్ చేసి పేమెంట్ చేయాలని పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో ఈ రకంగా కూడా ప్రభుత్వానికి తలనొప్పులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఏఎంసీ రోడ్డు వర్కులపై ఏదో ఒక నిర్ణయం త్వరగా తీసుకుంటే ఇటు రోడ్లు బాగు పడడంతోపాటు కాంట్రాక్టర్లకు కష్టాలు తప్పుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిపై పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ఎక్కడున్నావ్.. కాకాణీ!

ఏడు పోలీస్ బృందాల ముమ్మర గాలింపు

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోసం జిల్లా పోలీసులు జల్లెడ పడుతున్నారు. క్వార్ట్జ్ కేసులో ఏ4గా ఉన్న కాకాణికి న్యాయస్థానం ముందస్తు బెయిల్ రద్దు చేసిన విషయం తెలిసిందే. అప్పటినుంచి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏడు ప్రత్యేక బృందాలు హైదరాబాదు, బెంగళూరు ఇతర ప్రాంతాల్లో గాలిస్తున్నాయి. హైదరాబాదు, బెంగళూరులలోని కాకాణి నివాసాలు, బంధువుల ఇళ్ల వద్ద పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇళ్ల వద్దే ఉంటున్న పోలీస్ అధికారులు ఏక్షణాన్నైనా కాకాణి రాకపోతారా అని ఎదురు చూస్తున్నారు. మరికొన్ని పోలీసు బృందాలు సాంకేతికతను వినియోగిస్తూ కాకాణి జాడ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కాకాణి కోసం వెళ్లిన ప్రత్యేక బృందాలు ఆయన్ను పట్టుకున్న తర్వాతే జిల్లాకు తిరిగి వస్తాయని తెలుస్తోంది.

మేం సహకరిస్తాం.. మా డిమాండ్ల మాటేమిటి!?

- అధికారుల తీరుపై చేవూరు రైతుల అసహనం
- తమ భవిష్యత్తునూ ఆలోచించాలని వేడుకోలు
- గ్రామాన్ని పోర్టు సిటీగా అభివృద్ధి చేయాలి
- చెరువును పర్యాటకప్రాంతంగా మార్చాలని డిమాండ్
- లేకుంటే పోరుబాట తప్పదంటున్న గ్రామస్థులు

కందుకూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల భూసేకరణకు సహకరిస్తున్నా, తమ డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించటంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్న అసహనం చేవూరు గ్రామస్థుల్లో నానాటికీ పెరుగుతోంది. పరిశ్రమలకు తాము వ్యతిరేకం కాదు.. ఈ ప్రాంత అభివృద్ధిని కాంక్షిస్తూ భావోద్వేగబంధమున్న భూములను వదులుకునేందుకు తాము సిద్ధపడినా, తమ భవిష్యత్తు కోసం చేస్తున్న కనీస డిమాండ్ల పట్ల అధికారులు నియంతృత్వధోరణితో ఉన్నారని ఇదే ధోరణి కొనసాగితేఉద్యమానికి సిద్ధపడటం తప్ప మరోదారిలేదని వారు ఆగ్రహిస్తున్నారు. ఈ మేరకు గత మంగళవారం గ్రామంలో సమావేశమై అవసరమైతే సంఘటితపోరుకు సిద్ధపడాలని నిర్ణయించినట్లు సమాచారం. తాము చేస్తున్న నాలుగు ప్రధాన డిమాండ్లకు అధికారులు సానుకూల నిర్ణయం ప్రకటించకుంటే ఇక ఉద్యమబాటే గత్యంతరమని వారు అభిప్రాయపడినట్లు తెలిసింది.

● డిమాండ్లు ఇవీ..


రామాయపట్నం పోర్టుకు మణిహారంగా ఉన్న చేవూరు గ్రామాన్ని పోర్టు సిటీగా అభివృద్ధి చేయాలి. పోర్టు సంబంధిత అభివృద్ధి కోసం, పోర్టు రోడ్డు నిర్మాణంలో భూములు నష్టపోయిన నిర్వాసితులకు తక్షణం పరిహారం చెల్లించాలి. గ్రామం చుట్టూ కనీసం వెయ్యి మీటర్లు గ్రామస్థుల ఉపాధి కోసం సేకరణ నుంచి మినహాయించాలి. అందులో భాగంగా ఫిబ్రవరి 28న జారీచేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దుచేయాలని, భూసేకరణలో గ్రామంలో ఉన్న భూముల ఆరు క్లాసిఫికేషన్లను పరిగణలోకి తీసుకుని తదనుగుణంగా పరిహారం చెల్లించాలి. భూసేకరణ అధికారులు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యధోరణి ఫలితంగా ఇటీవల ఓ యువ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



భూసేకరణ నోటిఫికేషన్‌లోకి వచ్చిన నివాసగృహాలు


● పరిహారం చెల్లింపులో ఇంత నిర్లక్ష్యమా ?

జాతీయ రహదారి నుంచి రామాయపట్నం పోర్టుకు రోడ్డు నిర్మాణం కోసం గ్రామ రైతులు భూమిని కోల్పోగా దళిత రైతులకు నేటికీ పరిహారం చెల్లించకుండా ఇబ్బందిపెడుతున్నారని గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ రికార్డుల్లో సాగుదారులుగా దళితుల పేర్లు ఉన్నా అప్పట్లో పరిహారం ఇస్తామని చెప్పి ఇప్పుడు మెలికలు పెట్టడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అలాగే మరికొన్ని ప్రాంతాలలో లేని చెరువులు, కుంటలు ఉన్నట్లు చెబుతూ సాగుదారులకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నందున క్షేత్రపరిశీలన ఆధారంగా సాగుదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే మాగాణి, మెట్ట భూమితోపాటు తోటలు, రోడ్డు సైడు భూములు, ఇళ్ల స్థలాలు, భవిష్య త్తులో ఇళ్ల స్థలాలకు పనికొచ్చే భూములుగా 6 కేటగిరీలు విభజించి మార్కెట్ ధరలు నిర్ధారించి ఉన్నప్ప టికీ పరిహారం చెల్లింపులో రెండు విభాగాలుగానే పరిగణించి చెల్లిస్తామని చెప్పడం అన్యాయమని క్లాసిఫికేషన్‌ల వారీగా పరిహారం చెల్లించాలన్నది గ్రామస్థుల ప్రధాన డిమాండ్‌గా ఉంది. చేవూరు భౌగోళి కంగా రామాయపట్నం పోర్టుకు నెక్లెస్‌లా ఉన్నందున ఈ గ్రామాన్ని పోర్టుసిటీగా ప్రకటించడంతోపాటు పర్యాటకప్రాంతంగా అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పర్యాటకప్రాంత అభివృద్ధికి ఉన్న సహజవనరులు, పురాతన భవనాలు సూచిస్తూ రూపొందించిన మ్యాప్

వలసల నివారణకు చర్యలు చేపట్టాలి



చేవూరులో భూములు కోల్పోతున్న రైతులకు నిబంధనల మేరకు 6 క్లాసిఫికేషన్లు అమలుచేసి పరిహారం చెల్లించాలి. అలాగే వేలాదిమంది వ్యవసాయ కూలీలు ఉన్న ఈ గ్రామంలో ప్రజలకు ఉపాధి లేకపోతే వలసలు తప్పవు. గ్రామాన్ని పోర్టు సిటీగా అభివృద్ధి చేయటం ద్వారా ఉపాధి కల్పించాలి. అలాగే పశుపోషణ వంటి జీవనోపాధి దెబ్బతినకుండా పశుగ్రాసం పెంపునకు వీలుగా గ్రామంచుట్టూ కొంతభూమి వదిలేయాలి. భూసేకరణ ప్రారంభమైనప్పటి నుంచి ఈ డిమాండ్లు చేస్తున్నా అధికారుల నుంచి స్పష్టమైన హామీ లేదు. ఇప్పటికైనా స్పష్టత ఇచ్చాకే భూసేకరణ చేపట్టాలి.

- శెట్టిపల్లి వెంకటేశ్వర్లు, సర్పంచ్, చేవూరు

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి



చేవూరు పోర్టు సిటీగా ప్రకటించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన సహజసిద్ధ మౌలిక వనరులు ఇక్కడ ఉన్నాయి. జాతీయ రహదారి పక్కనే చేవూరు బస్టాండ్‌లో 50 ఎకరాల్లో అటవీశాఖ పార్కు, విహార కేంద్రం అభివృద్ధి చేస్తున్నందున దానిపక్కనే ఉన్న చెరువులో బోటుక్లబ్ ఏర్పాటు చేస్తే పర్యాటకులకు ఉపయోగకరంగా ఉంటుంది.

- నూతలపాటి వెంకటేశ్వర్లు, విశ్రాంత వీఆర్‌వో, చేవూరు రైతు

ఆత్మకూరు
ఉదయగిరి

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు 554 బేళ్లను తీసుకొని రాగా 15 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 407బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 147 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 230 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9008
వెండి కిలో ధర	రూ. 98,200
వెండి ఒక గ్రాము	రూ.101.20

మృత్యుమార్గాలుగా జాతీయ రహదారులు

● గాల్లో కలుస్తున్న ప్రజల ప్రాణాలు ● క్షతగాత్రులవుతున్న పలువురు ● ప్రమాదాల నివారణలో అధికారులు విఫలం

ఉదయగిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో జాతీయ రహదారులు మృత్యుమార్గాలుగా మారాయి. నిత్యం పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారులు రక్తంతో తడిసిపోతున్నాయి. ప్రజల ప్రాణాలు పోతున్నాయి. ఎంతోమంది క్షతగాత్రులవుతున్నారు. ప్రమాదాలను నియంత్రించడంలో అధికారులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నకిరేకల్ నుంచి ఏర్పేడు వరకు ఏర్పాటు చేసిన 565, కావలి నుంచి సీతారామపురం వరకు నిర్మాణమవుతున్న 167-బీజీ జాతీయ రహదారులపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. 565 జాతీయ రహదారి నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో రహదారంతా కుంగి, నెర్రెలుబారి ప్రమాదాలకు నిలయంగా మారింది. రహదారిపై మూగజీవాల సంచారం అధికంగా ఉండడంతో అవి కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దీనికితోడు రహదారులపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టం బల్బులు చాలాచోట్ల వెలగకపోవడంతో చీకట్లో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నిన్నమొన్నటి వరకు సింగిల్ రోడ్డుతో అవస్థలు పడిన వాహనదారులకు సుమారు 80 శాతం పనులు పూర్తి చేసుకున్న 167-బీజీ జాతీయ రహదారిపై మెరుపు వేగంతో రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకొంటున్నాయి. రోడ్డు ప్రారంభించకుండానే ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు మృత్యువాత పడుతుండగా, మరి కొందరు క్షతగాత్రులవుతున్నారు.


జాతీయ రహదారిపై ఢీకొన్న కారు, మినీ లారీ(ఫైల్)

అతివేగంతోనే ప్రమాదాలు

ప్రమాదాలు నియంత్రించడానికి, ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు రహదారులను విస్తరిస్తారు. కానీ రోడ్డు విస్తరణ తరువాత ప్రమాదాలు పెరుగుతుండడంతో ఆందోళన కలిగిస్తోంది. వాహనాల అతివేగం, వేగనియంత్రణ చర్యలు చేపట్టకపోవడం, పోలీసుల తనిఖీలు లేకపోవడంతో జాతీయ రహదారులపై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ప్రధానంగా 565 జాతీయ రహదారిపై వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి సెంటర్, వరికుంటపాడు పోలీస్‌స్టేషన్, తెడ్డుపాడు పిల్లాపేరు వాగు, నర్రవాడ, చింతలకుంట, దుత్తలూరు, నందిపాడు సెంటర్‌లలో ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. అలాగే 167-బీజీ జాతీయ రహదారిపై కుర్రపల్లి, సోమలరేగడ, ఉదయగిరి, బసినేనిపల్లి, కలిగిరి, వింజమూరు, జలదంకి ప్రాంతాల్లో ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటున్నాయి.

ప్రమాదాల నివారణకు చర్యలు : సీఐ



జాతీయ రహదారులపై ప్రమాదాలను నివారణకు చర్యలు చేపడుతున్నామని సీఐ ఎన్ వెంకటరావు తెలిపారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో రేడియం స్టిక్కర్లు, దీపాలను ఏర్పాటు చేశాం. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడంతోపాటు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పిస్తున్నాం. రహదారులపై గస్తీ ముమ్మరం చేసి రాత్రి 12 నుంచి ఉదయం 5 గంటల వరకు డ్రైవర్లకు ఫేస్‌వాషింగ్ కార్యక్రమం చేపడుతున్నాం.

ఉపాధి పనుల వద్ద కూలీలకు వసతులు

● బి.శ్రీనివాసరావు, ఏపీవో



ఉదయగిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల వద్ద కూలీలకు నీడ, నీటి వసతులు కల్పించడంతోపాటు మెడికల్ కిట్ అందుబాటులో ఉంచుతున్నామని ఏపీవో బి శ్రీనివాసరావు తెలిపారు. కూలీలు ఉదయం 6 నుంచి 11 గంటల వరకు పనిచేసేలా చర్యలు చేపడుతున్నాం. దినసరి వేతనం రూ.307 కాగా సరాసరి రోజుకు రూ.255లు నమోదవుతుందని తెలిపారు.

? మండలంలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి.

! మండలంలోని 17 పంచాయతీల్లో 7,500 జాబ్ కార్డులు ఉండగా 11,500 మంది కూలీలు ఉన్నారు.

? రోజుకు ఎంతమంది కూలీలు పనులకు హాజరు అవుతారు.

! ప్రతిరోజు 4,500 నుంచి 5వేల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. కూలీలకు పని ప్రదేశంలో నీడ, నీటి సౌకర్యంతోపాటు మెడికల్ కిట్ అందుబాటులో ఉంచుతున్నాం.

? బినామీ మస్టర్ల నివారణకు చర్యలు తీసుకుంటున్నారా.

! బినామీ మస్టర్ల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. తొలుత మరణించిన, వలస వెళ్లిన, సింగిల్ జాబ్‌కార్డులను తొలగిస్తున్నాం. గ్రామాల్లో సర్వే చేపట్టి పక్కాగా ఎవరున్నారో వారి కుటుంబానికి జాబ్‌కార్డు మంజూరు చేసి పని కల్పిస్తాం.

న్యూస్ బాక్స్

పాఠశాలకు విద్యా సామగ్రి పంపిణీ

సంగం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెం అరుంధతీవాడ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్ కింద ఇన్‌ఫినిటీ ఫిన్‌క్రాప్ సొల్యూషన్ ప్రైవేట్ కంపెనీ ఆధ్వర్యంలో పిల్లలు కూర్చొనేందుకు బల్లలు, కుర్చీలు, బీరువాతోపాటు బ్యాగ్‌లు, పలకలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంపెనీ ఎండీ శ్రీకాంత్ రావల్‌కార్, రీజనల్ సేల్స్ మేనేజర్ మోహన్, ఏరియా సేల్స్ మేనేజర్ సురేష్, ఏరియా క్రెడిట్ మేనేజర్ శ్రీను, నెల్లూరు క్రెడిట్ మేనేజర్ శ్రీకాంత్, ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ వెంకటేష్, ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సర్పంచుపై దాడి

కలువాయి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలాత్మకూరు సర్పంచు ఏలూరు ప్రభావతి ఆమె సోదరుడు సోంపల్లి నరేష్‌పై జరిగిన దాడి సంఘటనపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం ఎస్‌ఐ సుమన్ తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో సోమవారం శ్రీరామనవమి ఉత్సవాలు జరుగుతుండగా ఆలయ పరిసరాల్లో అన్నదానం కోసం నిర్మించిన రేకుల షెడ్డు విషయమై వివాదరం చెలరేగి ఘర్షణకు దారితీసింది. దీంతో సర్పంచు, ఆమె సోదరుడిపై గ్రామానికి చెందిన కొరకూటి మోహన్‌రావు, కూచి వెంకటేశ్వర్లు, కూచి వెంకటరమణ దాడి చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్ బోల్తా


బోల్తాపడ్డ టిప్పర్

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న ఇసుక టిప్పర్ బోల్తాపడిన సంఘటన జడదేవి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. సంగం ఇసుక రీచ్ నుంచి ప్రకాశం జిల్లా మార్కాపురానికి ఇసుకను తీసుకెళుతుండగా డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు, జాతీయ రహదారి సిబ్బంది అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

కల్లు దుకాణం దగ్ధం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడదేవి జాతీయ రహదారి సమీపంలోని కల్లు దుకాణం దగ్ధమైన సంఘటన మంగళవారం చోటుచేసుకొంది. తెల్లవారుజాము సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తమ దుకాణాన్ని ఉద్దేశపూర్వకంగానే దగ్ధం చేసినట్లు యజమాని పాలకూరి నాగయ్య వాపోయాడు. అప్పు ఉన్న వారిని డబ్బులు అడిగినందుకే ఇలా చేశారని ఆవేదన వ్యక్తంచేశాడు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

ఆత్మకూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్ జంక్షన్‌లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం పత్రపూజ నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం, సహస్రనామార్చన గావించారు. అనంతరం ప్రత్యే క పూజలు చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

చలివేంద్రం ప్రారంభం


దువ్వూరులో చలివేంద్రం ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎంపీడీవో షాలెట్

సంగం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరు బస్టాండ్‌లో మంగళవారం ఎంపీడీవో షాలెట్ చలివేంద్రం ప్రారంభించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జాతీయ రహదారి దువ్వూరు బస్టాండ్‌లో ప్రారంభించిన చలివేంద్రంలో తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారెళ్ల కృష్ణమ్మ, డీఎల్పీవో నయీం, పంచాయతీ కార్యదర్శి హమీద్, స్థానిక టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం అందించాలి


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కలీం

ఉదయగిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తిథి భోజనం అందించేందుకు దాతలు ముందుకు రావాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు కోరారు. మంగళవారం స్థానిక దళితవాడ పాఠశాల విద్యార్థులకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కలీం కుమారుడి పుట్టినరోజు సందర్భంగా ఎంఈవో మాంసాహార భోజనం, పండ్లు అందజేశారు. అనంతరం విద్యార్థుల అభ్యసన, పఠన సామర్థ్యాలను పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై గర్భిణులకు అవగాహన


అంగన్‌వాడీలో పోషకాహార పక్షోత్సవాలలో పాల్గొన్న బాలింతలు

వింజమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో మంగళవారం పోషకాహార పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్‌కె.షకీలా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన తల్లులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎల్ శైలజ, ఆశా వర్కర్ ఎంఎస్‌కే స్రవంతి తదితరులు ఉన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన వారు ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి వోబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో మల్లికార్జున్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రుణాల దరఖాస్తుకు వచ్చేనెల 10వ తేదీ వరకు గడువు ఉందని, అర్హులైన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఈదురుగాలులతో నేలకొరిగిన చెట్లు


గండిపాళెంలో రహదారికి అడ్డంగా కూలిన చెట్టు

ఉదయగిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతో అల్లాడిన ప్రజలు సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసి వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. ఈదురుగాలులు వీయడంతో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు నేలకొరిగాయి. అలాగే మామిడి కాయలు, కొమ్మలు నేలరాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

వరికుంటపాడు మండలంలో

ఉదయగిరి రూరల్: వరికుంటపాడు మండలంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు మండలంలోని కాంచెరువు, ఇస్కపల్లి గ్రామాల సమీపంలో రహదారికి అడ్డుగా తాటాకులు, కంపచెట్లు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గాలుల తాకిడికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు, దుకాణదారులు ఇబ్బందులు పడ్డారు.

కలువాయిలో...

కలువాయి: మండలంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భారీ వర్షంకు వీధులన్నీ జలమయమయ్యాయి. ధాన్యం పొలాల్లో నిల్వ చేసుకున్న రైతులు ఆందోళన చెందారు.

అంధకారంలో రాజుపాళెం

మండలంలోని రాజుపాళెం గ్రామం రెండు రోజులుగా విద్యుత్ సరఫరా లేక అంధకారంలో ఉంది. ఆదివారం రాత్రి గాలివానకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అప్పటి నుంచి విద్యుత్ సిబ్బంది శ్రమిస్తున్నా ఇంకా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాలేదు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


ఆత్మకూరులో అగ్ని ప్రమాద నివారణ చర్యలను ప్రదర్శిస్తున్న ఫైర్‌ఆఫీసర్ శ్రీనివాసరావు, సిబ్బంది

ఆత్మకూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో సంభవించే అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసర్ కె శ్రీనివాసరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయన ఆర్టీసీ గ్యారేజ్ ప్రాంగణం, రామకృష్ణ థియేటర్ ప్రాంగణంలో అగ్నిప్రమాదాల నివారణ చర్యలను ప్రయోగాత్మకంగా గ్యారేజ్ సిబ్బందికి, ప్రయాణికులకు చూపించి అవగాహన కల్పించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బందితో కలసి పట్టణ, పురవీధుల్లో కరపత్రాలను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ కరీ మున్నీసా, లీడింగ్ ఫైర్‌మెన్‌లు ఏ నరసయ్య, ఏ సుధాకర్, అగ్నిమాపక సిబ్బంది పా ల్గొన్నారు.

● ఉదయగిరి: అగ్నిప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి అగ్నిమాపక శాఖాధికారి అశోక్‌కుమార్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలో అగ్నిప్రమాదాలపై కార్మికులు, ఉద్యోగులకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను ఎలా అదుపుచేయాలో సిబ్బంది చేసి చూపించారు. నివాసాల్లో వంట చేసే సమయంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి


ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, అధికారులు

ఆత్మకూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టామని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీలకు ట్రైసైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ నిధుల నుంచి ట్రైసైకిళ్లు కొనుగోలు చేశామన్నారు. బట్టేపాడు, నాగులపాడు, రావులకొల్లు, అప్పారావుపాళెం, మురగళ్ల, కనుపూరుపల్లి, రామస్వామిపల్లి పంచాయతీలకు పంపిణీ చేశామన్నారు. అనంతరం ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి ఎస్‌డబ్ల్యుపీసీ కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్టు తయారుచేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ డేవిడ్, పరిపాలనాధికారి శ్రీనివాసరావు, పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : ఈవోపీఆర్డీ

సీతారామపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని ఈవోపీఆర్డి భార్గవి సూచించారు. మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని ఈవోపీఆర్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు, పలు రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇంటి పన్నుల వివరాలను స్వర్ణ పంచాయతీలో అప్లోడ్ చేయాలని తెలిపారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సచివాలయంలో సేవలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆదిశగా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంనాథ రెడ్డి, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S


సీజ్ చేసిన టిప్పర్లు

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న
మూడు టిప్పర్ల సీజ్

పొదలకూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుపూరు నుంచి నెల్లూరుకు అక్రమంగా గ్రావెల్ రవాణా జరుగుతోందన్న సమచారం మేరకు తహసీల్దారు శివకృష్ణయ్య తన సిబ్బందితో కలిసి దాడులు జరిపి మూడు టిప్పర్లను సీజ్ చేశారు. సీజ్ చేసిన టిప్పర్లను పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పారు. ఈదాడుల్లో ఆర్‌ఐ అశ్వత్ నారాయణ, వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య

● భర్త వేధింపులే కారణమంటున్న కుటుంబ సభ్యులు


పూర్ణిమ మృతదేహం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో నెల్లూరులోని ఫతేఖాన్‌పేటలో ఉన్న పోలీస్ క్వార్టర్స్‌లో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల సమాచారం మేరకు.. ఒంగోలు ప్రాంతానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ బీ నాగరాజుకు గతంలో వివాహం జరిగి ఇద్దరు పిల్లలున్నారు. భార్య మృతి చెందడంతో. ఈ విషయమై నాగరాజుపై ఒంగోలులో కేసు నడుస్తోంది. జిల్లాల విభజనలో భాగంగా నాగరాజు ఒంగోలు నుంచి నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. తొమ్మిది నెలల క్రితం పొదిలి ప్రాంతానికి చెందిన పూర్ణిమను రెండో వివాహం చేసుకున్నారు. రెండు నెలల క్రితమే వారు పత్తేఖాన్‌పేటలోని పోలీసు క్వార్టర్స్‌లో కాపురం పెట్టారు. భార్యాభర్తల మధ్య గొడవల నేపథ్యంలో మంగళవారం ఉదయం పూర్ణిమ ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ఫ్యానుకి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి పత్తేఖాన్‌పేట వీఆర్‌వో మహేష్‌కు సమాచారం అందించారు. ఆయన సమాచారంతో చిన్నబజారు పోలీసులు అక్కడికి చేరుకొని తలుపులు పగులగొట్టి పూర్ణిమ మృతదేహాన్ని కిందకు దించారు. పోస్టుమార్టం నిమ్మి తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్ణిమ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భర్త వేధింపులు తట్టుకోలేకే ఆమె ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : భర్తపై అలిగి ఓ వివాహిత ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని కిసాన్ నగర్‌లో షేక్ నసీర్, నస్రీన్ దంపతులు నివసిస్తున్నారు. నస్రీన్ భర్తపై అలిగి ఈ నెల 5వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో నసీర్ నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

వరకట్నం కేసు నమోదు

వెంకటాచలం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన భర్త అత్త, మామ, వదినలతో కలిసి అదనపు కట్నం తీసుకురావాలని చిత్రహింసలు పెడుతున్నారని బాధితురాలు తురక అనూష పోలీసులకు మంగళవారం ఫిర్యాదుచేసింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని తిక్కవరప్పాడు గ్రామానికి చెందిన తురక అనూషకు ఏడాది క్రితం వెంకటాచలం పంచాయతీ వడ్డిపాళెం గ్రామానికి చెందిన తురక లోకేష్‌తో వివాహం జరిగింది. అయితే భర్త లోకేష్ మద్యానికి బానిసై మా మ హరిబాబు, అత్త హరిత, వదిన ఉషలతో కలిసి చిత్ర హింసలు పెడుతూ అదనపు కట్నం తీసుకుని రావాలని వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో పోలీసులు మంగళవారం వరకట్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● వరకట్నం కేసు..

అదనపు కట్నం కోసం తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని బాధితురాలు ఉప్పు లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని రామదాసుకండ్రిగ పంచాయతీ నాయుడుపాళెం గ్రామానికి చెందిన ఉప్పు లావణ్యకు అదే గ్రామానికి చెందిన ఉప్పు శ్రీహరితో వివాహం జరిగింది. అయితే తన భర్త అత్త ఉప్పు రమణమ్మ, బెల్లకొండ పావని, బెల్లకొండ మురళీలతో కలిసి చిత్రహింసలు పెడుతున్నాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో పోలీసులు మంగళవారం వరకట్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

వెంకటాచలం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొలగమూడి గ్రామంలో మంగళవారం అనుమానాస్పద స్థితిలో ఒక వృద్ధుడు మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. కోవూరి సూరిబాబు (67) కాలేయ వ్యాధితో బాధపడుతూ ఒంటరిగా నివసిస్తున్నాడు. అయితే స్థానికులు అతను మృతిచెందినట్లుగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనారోగ్య కారణంగానే మృతిచెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి ..

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కసుమూరు గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాల మేరకు కసుమూరు గ్రామానికి చెందిన బిరుదోలు చిన్నయ్య (54) కట్టెలు కొట్టేందుకు చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కిందపడి పోయాడు. దీంతో అతన్ని చికిత్స కోసం నెల్లూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి బంధువులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య బిరుదోలు రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మునిగి వ్యక్తి..

వెంకటాచలం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురిచెర్లపాడు చెరువులో ప్రమాదవశాత్తు ఒక వ్యక్తి మునిగి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కురిచెర్లపాడు పంచాయతీ వీవర్స్ కాలనీకి చెందిన మోహన్ (54) ఆదివారం పొలం వద్దకు వెళ్తున్నట్టు ఇంటి వద్ద చెప్పి వెళ్లాడు. అయితే సోమవారం సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో మంగళవారం మోహన్ కురిచెర్లపాడు సమీపంలో ఉన్న చెరువులో మృతదేహమై కనిపించాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 420

విద్యార్థినికి ఎస్ఐ శ్రీనివాసులు ఆర్థిక సాయం

కావలిటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : కావలి విట్స్ కళాశాలలో ఎంసీఏ పూర్తి చేసుకుని పెండింగ్ ఫీజు చెల్లించలేకపోవడంతో ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బంది పడుతున్న ఓ విద్యార్థినికి నెల్లూరులో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఒట్టూరు శ్రీనివాసులు రూ.10,000 ఆర్థిక సాయమందించి మానవత్వం చాటుకున్నారు. మంగళవారం వెంగళరావునగర్‌లోని సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన సమక్షంలో విశ్రాంత బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్, విశ్రాంత అధ్యాపకులు ప్రసాదరావుల చేతుల మీదుగా విద్యార్థిని సాయిప్రియకు నగదు సాయమందించారు. వారు మాట్లాడుతూ ఎస్ఐ శ్రీనివాసులు తండ్రి మాలకొండయ్య ఆశయాలకనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు

కావలిటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం పాతూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఇంటర్ ర్యాంకర్లను మంగళవారం ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అభినందించారు. విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించి మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి కావలి కీర్తిని రాష్ట్రస్థాయికి ఇనుమడింపజేయడం గర్వకారణమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించడంలో కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకయ్య, డైరెక్టర్ పీపీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చక్రపాణి



కావలిటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కే. చక్రపాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కోర్టు భవనంలోని బార్ కార్యాలయంలో జరిగిన బార్ ఎన్నికల్లో చక్రపాణి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయగా ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. అనంతరం ఆయన ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలవగా ఆయన శాలువాతో సత్కరించి అభినందించి పేద వారికి న్యాయ సహాయం అందించి కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు. టీడీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజ్‌కుమార్ చౌదరి, సీనియర్ న్యాయవాది శివకుమార్‌రెడ్డి, న్యాయవాదులు, సిబ్బంది చక్రపాణిని అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం

కొండాపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమెనపెంట పంచాయతీ సచివాలయం వద్ద నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. అంతకుముందు సచివాలయంలో మహాత్మ గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా పంచాయతీలో జరగాల్సిన పనులపై అధికారులు నిర్వహించిన గ్రామసభకు హాజరైన ప్రజలకు, ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో ఈవోపీఆర్డీ నారాయణరావు, టీడీపీ నాయకులు అల్లిక మధు, చెన్నుపాటి శ్రీనివాసులు, నందా మాచర్ల, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కొండాపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో ఆదినారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మూడు నెలల కాలంలో మండలంలో జరిగిన అభివృద్ధి పనులతోపాటు జరగాల్సిన పనులపై సమీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని పలుశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తప్పకుండా పాల్గొనాలని తెలిపారు.

నేడు కలిగిరి మండల పరిషత్...

కలిగిరి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రత్యూష ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు గ్రామాభివృద్ధికి సంబంధించిన సమగ్ర నివేదికలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ఆమోదం మాలలపై కక్ష సాధింపే..!

కందుకూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపడం మాలలపై కక్ష సాధింపేనని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్లను రాష్ట్రాలు వర్గీకరణ చేసుకోవచ్చునని, ఇప్పటికీ రిజర్వేషన్ ఫలాలు అందుకోలేని కులాలు ఏమైనా ఉంటే వారికి ఎక్కువభాగం ఇచ్చి ఆ కులాలు కూడా అభివృద్ధి చెందేలా చూడాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చిందని, అయితే కొత్తగా ఎస్సీ జనాభా, ఎంపీరికల్ డేటా ప్రకారమే చేయాలని స్పష్టం చేసిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పెద్దలు సుప్రీంకోర్టు సూచనలను లెక్కచేయకుండా తప్పుడు జనాభా లెక్కలతో తప్పుడు సమాచారంతో మాదిగలకు మేలు చేసి వారిని శాశ్వత ఓటు బ్యాంకుగా మార్చుకునే కుటిలపన్నాగం పన్నిందని తెలిపారు. రిజర్వేషన్ల శాతం పెంచాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు ఇవ్వాలని, భూములు, పరిశ్రమలు పంచాలని ఎస్సీలు ఎంతోకాలంగా డిమాండ్ చేస్తున్నా కనీసం చెవికెక్కించుకోని చంద్రబాబు నాయుడు ప్రస్తుతం రిజర్వేషన్ల వర్గీకరణ ద్వారా మాలలపై కక్ష సాధింపుకు తెగబడ్డాడని పేర్కొన్నారు. తెలంగాణలోనూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు అక్క డి ప్రభుత్వం సిద్ధపడడం దురదృష్టకరమని పేర్కొన్నారు.



బుడంగుంట కాలనీలో నిరుపయోగంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు

క్షణ క్షణం..

భయం.. భయం..!

- శిథిలావస్థలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు
- చౌదరిపాలెం, బుడంగుంటలో ప్రజలకు పొంచి ఉన్న ప్రమాదం
- ఎప్పుడు కూలుతాయోనని ఆందోళనతో జనం బెంబేలు
- ప్రమాదమని తెలిసినా పట్టించుకోని అధికారులు, పాలకులు

కావలి రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల నడిబొడ్డున ప్రజల దాహార్తి తీర్చేందుకు నాడు నిర్మించిన రక్షిత మంచినీటి పథకాల ఓవర్ హెడ్ ట్యాంకులు నేడు శిథిలావస్థకు చేరి ఏ క్షణమైనా కూలేందుకు సిద్ధంగా ఉండడంతో ప్రజలు ప్రతి క్షణం భయాందోళన చెందుతోన్నారు. నివాసాల మధ్య నిరుపయోగంగా మారి ప్రమాదకరంగా ఉన్న వీటితో ప్రమాదం పొంచిఉంది. అయినా అధికారులు, పాలకులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

కావలి మండలంలోని చౌదరిపాలెంలో నివాసాల మధ్యన 70 ఏళ్ల క్రితం నిర్మించిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు పిల్లర్లు పూర్తిగా దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉంది. దీనికి నీటిని నింపితే లీకేజీలు అవుతుండడంతో గ్రామంలో మరో వాటర్ ట్యాంకు నిర్మించి ప్రారంభించారు. కానీ నాటి నుంచీ నేటి వరకు శిథిలమైన ట్యాంకు తొలగించకపోవడంతో ఎప్పుడు కూలి నివాసాలపైన పడుతుందోనని ఆ ప్రాంత వాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అలాగే బుడంగుంట ఇందిరమ్మకాలనీలో గ్రామ ప్రజలకు నీరందిస్తున్న వాటర్ ట్యాంక్ పిల్లర్లు దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉండడంతో గ్రామస్థులు ట్యాంక్ పరిసర ప్రాంతాలకు రావడానికి భయాందోళన చెందుతున్నారు. ఈ రెండు గ్రామాల్లో పరిస్థితులపై అనేక దఫాలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని, ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం వాటిల్లితేగాని పట్టించుకోరా అని అధికారులు, పాలకులపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి మండలంలో శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులు గుర్తించి తొలగించాలని గ్రామీణ ప్రాంత వాసులు కోరుతున్నారు.



చౌదరిపాలెంలో శిథిలమైన పిల్లర్లు

ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు



70 ఏళ్ల నాటి ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పిల్లర్లు దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉండడంతో నూతన ట్యాంక్ నిర్మించారు. కానీ నివాసాలపై ట్యాంక్ కూలుతుందని, దాన్ని తొలగించాలని అనేక మార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు.

- మండువ శ్రీనివాసులు, చౌదరిపాలెం

ట్యాంకు కూల్చివేసి ప్రజలకు రక్షణ కల్పించాలి



ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పిల్లర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. చిన్నపాటి గాలులు వీచినా నివాసాలపై కూలుతుందేమోనని ఆందోళనగా ఉంది. ప్రమాదకరంగా ఉన్న దీనిని కూల్చివేసేందుకు పాలకులైనా చొరవ తీసుకోవాలి. లేకుంటే ప్రజలకు ప్రమాదం తప్పదు.

- కంటు రమేష్‌బాబు, చౌదరిపాలెం

ఇలా ఉంటే రోగాలు రావా ?



గరుకుపాలెంలో మినీ వాటర్ ట్యాంక్ వద్ద పాచిపట్టి చుట్టూ చేరిన మురుగు

వలేటివారిపాలెం మండలంలోని పోలినేనిచెరువు పంచాయతీ గరుకుపాలెంలో మినీవాటర్ ట్యాంక్ దిమ్మె చుట్టూ పాచి పట్టి అపరిశుభ్రంగా ఉంది. ట్యాంక్ లోపల కుళాయి చుట్టూ పాచి పట్టింది. అంతేగాకుండా ట్యాంక్ చుట్టూ మురుగునీరు ముందుకు పోయే అవకాశం లేక నిల్వ చేరింది. ఆ మురుగు నీటిలోని విద్యుత్ మోటారు స్విచ్ ఉంది. ఆ నీటినే గ్రామస్థులు తాగుతున్నారు. ఈ ట్యాంక్‌ను చూస్తేనే తెలుస్తుంది దీనిలో క్లోరినేషన్ చేసి ఎన్నో ఏళ్లు గడిచి ఉంటుందని. ఇది పంచాయతీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం. ఈ కలుషిత నీరు తాగితే రోగాలు రావా అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మినీ వాటర్‌ట్యాంక్‌ను క్లోరినేషన్ చేసి మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం,(ఆంధ్రజ్యోతి)

గర్భిణులు, బాలింతలు పేర్లు నమోదు చేసుకోవాలి

లింగసముద్రం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రంలో పేర్లు నమోదు చేయించుకోవాలని ఐసీడీఎస్ లింగసముద్రం సెక్టార్ సూపర్‌వైజర్ నీలాంబరి చెప్పారు. మంగళవారం లింగసముద్రం పంచాయతీ జంగంరెడ్డిపాలెంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సకాలంలో పౌష్టికాహారం తీసుకుంటేనే పిల్లలు ఆరోగ్యంగా జన్మిస్తారన్నా రు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త టి.సరోజిని, ఆశా వర్కరు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



లింగసముద్రం: పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నీలాంబరి

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

బిట్రగుంట,(ఆంధ్రజ్యోతి): తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భం దాల్చినప్పటి నుంచి కచ్చితంగా పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్వాడీ సూపర్ వైజర్ సుభాషిణి అన్నారు. బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీ కొత్తబంగారుపాలెంలో మంగళవారం పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెయ్యి రోజులు సంరక్షణ అంటే మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు రెండేళ్లు పూర్తి అయ్యేవరకు స్వర్ణ రోజులంటారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందచేసే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం సెక్టారులోని అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, తల్లులు, కిశోరబాలికలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లోగో టోపీల విడుదల



ఎమ్మెల్యే లోగో టోపీలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలిటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే లోగోతో కూడిన టోపీలను ఎమ్మెల్యే కృష్ణారెడ్డి కార్యకర్తలకు అందజేశారు. ఎమ్మెల్యే అభిమాని షేక్ అలహార్ తయారు చేయించిన ఈ టోపీలను మంగళవారం ముసునూరులోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే విడుదల చేశారు. ఇంటింటికి ఎమ్మెల్యే.. సమస్య మీది.. పరిష్కారం నాది కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. ఎమ్మెల్యేతోపాటు తిరిగే కార్యకర్తలు వేసవి తాకిడికి తట్టుకునేందుకు టోపీలను బహూకరించామని అలహార్ తెలిపారు. ఎమ్మెల్యే అలహార్‌ను అభినందించారు.

పంట కాలువల మరమ్మతులు చేసుకోవాలి

- సోమశిల ప్రాజెక్టు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్

అల్లూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : అల్లూరు చెరువు, రామన్న చెరువు ఆయకట్టుల పరిధిలోని రైతులు తమ భూముల్లో రెండో పంట సాగు చేసుకోవడానికి వీలుగా పంట కాలువల మరమ్మతులు చేపట్టాలని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ రైతులకు సూచించారు. అల్లూరులోని ఇరిగేషన్ బంగ్లా వద్ద ఏఈ సుధీర్‌తో కలసి మంగళవారం ఆయన సాగునీటి సంఘాల డైరెక్టర్లు, రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండోకారు సాగుకు కాలువలు పూడిపోయి సాగునీరు పుష్కలంగా పారే పరిస్థితి లేదన్నారు. కాలువల మరమ్మతులు చేసుకుం టే నీటిని పొదుపుగా వినియోగించుకో వచ్చన్నారు. మరమ్మతులు చేపట్టిన రైతులు ఆయి కాలువల డైరెక్టర్ల ద్వా రా తెలియజేస్తే ఆ ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు సిద్ధమన్నారు. చివరి ఆయకట్టు భూములకు సాగునీరందాలంటే కాలువలు శుభ్రంగా ఉండాలన్నారు. ఈనెల 17న ఐఏబీ సమావేశం ఉన్నందున సాగునీరు విడుదల చేసేలోపు మరోదఫా ఇదేవిధంగా సమావేశం ఏర్పాటు చేసుకొని ఆయకట్టును నిర్ణయించుకుందామన్నారు. ఈ విషయంలో రైతుల సహకారం తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, పరంధామిరెడ్డి, తోట శ్రీహరి, అంబటి రాజేంద్ర, మేడా కృష్ణారెడ్డి, ఎందేటి హరికృష్ణ, రేబాల శంకర్‌రెడ్డి, అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.



నీటిపారుదల శాఖ ఏఈతో కలసి సాగునీటి డైరెక్టర్లు, రైతులతో మాట్లాడుతున్న బీద గిరిధర్

వైద్య పథకాలపై అవగాహన కల్పించాలి

కందుకూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతి ఒక్కరికీ వైద్యం అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో అమలు చేస్తున్న జాతీయస్థాయి వైద్య పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి కోరారు. హెల్త్ మేనేజిమెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం, రీప్రొడక్టివ్ చైల్డ్‌హెల్త్ కార్యక్రమంపై పట్టణంలోని నక్షత్ర ఐటీఐ, జేఈఈ అకాడమీలో మంగళవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ జాతీయ వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంపై అవగాహన కల్పించి సకాలంలో ప్రతి ఒక్కరికీ టీకాలు అందించాలన్నారు. కందుకూరు ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టరు రజని మాట్లాడుతూ ఈనెల 17, 21, 22 తేదీలలో డివిజన్‌లోని లింగసముద్రం, వలేటివారిపాలెం, మాచవరం, కొండాపురం, వరికుంటపాడు, కందుకూరు అర్బన్ పీహెచ్‌సీల పరిధిలోని వైద్యాధికారులు, వైద్యసిబ్బందికి ఈ శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టరు రమేష్, సీహెచ్‌వో శ్రీనివాసులు, హనుమంతరావు, కరేడు, చాకిచర్ల, గుడ్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, ఫార్మాసిస్టులు, స్టాఫ్ నర్సులు, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆరోగ్య కార్యకర్తలు, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టరు ఉమామహేశ్వరి

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మంటలు ఆర్పే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కావలి రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ జి.ప్రభాకర్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలల్లో భాగంగా కావలి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో మంగళవారం అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్యాస్ సిలిండర్‌కు మంటలు అంటుకుంటే చేపట్టాల్సిన విధానంపై డెమో చూపించారు. అనంతరం కరతపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా

కావలిటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ అనుబంధ పారిశుధ్య కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి పై కృష్ణమోహన్, గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు కార్మికులను అప్పజెప్పాలని చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ వచ్చిన తర్వాతే కార్మికులకు ఉద్యోగ భద్రత లభించిందని, ప్రతినెలా జీతాలు వస్తున్నాయని, దానిని రద్దు చేస్తే కార్మికులకు ఇబ్బందులు తప్పవన్నారు. గతంలో కార్మికులు ప్రైవేట్‌లో ఉన్నప్పుడు జీతాలు సక్రమంగా వచ్చేవి కాదని, వేధింపులకు గురయ్యేవారని, పనిభారం ఎక్కువగా ఉండేదన్నారు. కార్మికులను రెగ్యులర్ చేయాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్ అయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి పని కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మధుసూదన్‌రావు, యూనియన్ నాయకులు తురకా శీనయ్య, బీ రమేష్, బాలయ్య, ఒంగోల్ రమేష్, కావలి బాబు, జలదంకి శీనయ్య, చిన్నమ్మ, రాజ్యలక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

మా గ్రామం అభివృద్ధికి నోచుకోలేదు!

అల్లూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో మా గ్రామం అభివృద్ధికి నోచుకోలేదని, తమ గ్రామానికి తాగునీటి సమస్య, భూసమస్య వెంటాడుతున్నాయని మండలంలోని పడమర గోగులపల్లి చింతచెట్టు కాలనీ వాసులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. మంగళవారం రాత్రి ఆ గ్రామంలో సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ఆ గ్రామస్థులతో మమేకమై సమస్యలను తెలుసుకున్నారు. భూ సమస్యలు అత్యధికంగా ఉన్నాయని జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలను చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ఆట తిరుమల, నాయకులు బండి శ్రీనివాసులురెడ్డి, మేడా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలోనే చెత్త బుట్టలు!

వలేటివారిపాలెం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తడి పొడి చెత్త సేకరణకు వినియోగించాల్సిన చెత్త బుట్టలు మండల కేంద్రమైన వలేటివారిపాలెం గ్రామ సచివాలయంలో వృథాగా మూలన పడి ఉన్నాయి. గ్రామంలోని ఒక్కో కుటుంబానికి తడి, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేయాలని ప్రభుత్వం వీటిని సరఫరా చేసింది. పంపిణీ చేసిన తడిపొడి చెత్త బుట్టలో వేర్వేరుగా చెత్తను వేస్తే పారిశుధ్య కార్మికులు ఇళ్లకు వెళ్లి ఆ చెత్తను తీసుకెళ్లి చెత్తసంపద కేంద్రానికి తరలించి ఆ కేంద్రంలో సేంద్రియ ఎరువులు తయారీ చేసి రైతులకు తక్కువ ధరలకే విక్రయించాలి. ఈ సేంద్రియ ఎరువుల నుంచి వచ్చే ఆదాయంతో పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. అందులో భాగంగానే ప్రభుత్వం వేర్వేరుగా తడి పొడి చెత్త సేకరణకు బుట్టలను సరఫరా చేసింది. అయితే పంచాయతీ సిబ్బంది ప్రభుత్వం సరఫరా చేసిన ఈ బుట్టలను కుటుంబాలకు పంపిణీ చేయకుండా గ్రామ సచివాలయంలో వృథాగ పడేశారు. దీంతో ఆ చెత్త బుట్టలు నిరుపయోగంగా మారాయి. చెత్త బుట్టలు లేక చెత్తను వీధుల్లో వేస్తున్నారు. దీంతో పారిశుధ్యం క్షీణించి అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ సిబ్బంది స్పందించి గ్రామ సచివాలయంలో వృథాగా ఉన్న చెత్త బుట్టలను ఇళ్లకు పంపిణీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వలేటివారిపాలెం గ్రామ సచివాలయంలో ఉన్న ప్లాస్టిక్ బుట్టలు

చేతిపంపునకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లింగసముద్రం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్ల గ్రామం ఆదిఆంధ్ర కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో తక్కువ ఎత్తులో ఉన్న చేతి పంపు మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకున్నారు. 'చేతిపంపు వద్ద నీటి కోసం అవస్థ' శీర్షికతో ఈ నెల 10న ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు ఎంపీడీవో కె శ్రీనివాసులు స్పందించి పంచాయతీ కార్యదర్శి వెంకటరావు, బోరు మెకానిక్ శ్రీనివాసులు ద్వారా చేతిపంపుకు అదనపు పైపు వేసి చేతిపంపు హెడ్‌ను ఎక్కువ ఎత్తులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. దీంతో విద్యార్థులు, కుకింగ్ ఏజన్సీ వారు చేతిపంపు నుంచి నీరు శులభంగా పట్టుకొన్నారు.



పాఠశాలలో చేతిపంపునకు అదనపు పైపు బిగిస్తున్న సిబ్బంది

నెల్లూరులో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి

- హైవేపై సోలార్ దీపాలు అమర్చాలి
- రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో జేసీ కార్తీక్



రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు త్వరగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో మంగళవారం రోడ్డు భద్రత కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధర్ వివరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవా లన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతున్న దృష్ట్యా ఏసీ కూరగాయల మార్కెట్ సెంటర్, జిల్లా పోలీసు కార్యాలయం సెంటర్, కేవీఆర్ జంక్షన్, కనకమహల్ సెంటర్, రామలింగాపురం, వీఆర్సీ తదితర ప్రధాన కూడళ్లలో సిగ్నల్ వ్యవస్థను మే నెల మొదటి వారంలోగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో ఏర్పాటు చేసిన సిగ్నల్ వ్యవస్థలోని లోపాలు పునరావృతం కాకుండా పకడ్బందీగా సిగ్నల్ పాయింట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. రద్దీ ప్రాంతాల్లో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు, ఇతర ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుజబుజ నెల్లూరు నుంచి కోవూరు వరకు జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న 11 ప్రాంతాల్లో సోలార్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ అధికారులకు సూచించారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రహదారుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, పెయింటింగ్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, హైవేపై మద్యం దుకాణాలు లేకుండా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు, ఒంగోలు ఎన్‌హెచ్ఏ పీడీలు ఎంకే చౌదరి, ఎం విద్యాసాగర్, సర్వే ల్యాండ్ రికార్డుల ఏడీ నాగశేఖర్, డీఎస్పీ జీ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ కే రామకృష్ణ, మున్సిపల్ ఎస్ఈలు రామ్మోహన్‌రావు, జానీ, రవాణాశాఖ అధికారి బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

పచ్చిరొట్ట పైర్లతో భూమి సారవంతం

- మొక్కకు తగిన మోతాదులో పోషకాలు
- ఖర్చు తక్కువ.. మంచి దిగుబడులు : డీఏవో సత్యవాణి

వరిలో నాణ్యమైన, అధిక దిగుబడులకు పచ్చిరొట్ట పైర్లు ఎంతో ఉపయోగపడతాయి. వరిసాగుకు ముందుగా పచ్చిరొట్టపైర్లతో పొలంలో దమ్ము చేస్తే పైరుకు అవసరమైన సేంద్రీయ పదార్థాలను అందిస్తుంది. అంతేగాక భూమికి నత్రజని, ఇతర పోషకాలను అందిస్తాయి. పచ్చిరొట్ట పైర్లు అయిన జీలుగ, జనుము, పిల్లిపెసర, అలసంద, పెసర, వెంపల్లి వంటి పైరును పెంచి పూతదశకు ముందుగా పొలంలో దమ్ము చేయాలి. తర్వాత వరినాట్లు వేసుకొన్నట్లయితే అనేక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి తెలిపారు. తక్కువ ఖర్చుతో భూమికి ఎక్కువ పోషకాలు అందుతాయని 'ఆంధ్రజ్యోతి' ద్వారా ఆమె రైతులకు తెలియజేశారు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

వరిసాగుకు ముందు పచ్చిరొట్ట పైర్లతో దమ్ము చేయడం వల్ల భూమి భౌతి కస్థితిని మెరుగుపరుస్తుంది. భూమిలో పైర్లకు కావాల్సిన సేంద్రీయ పదార్థాలను అందిస్తుంది. భూమిలో నీటిని నిల్వ చేసే గుణాన్ని పెంచడంతో పాటు నత్రజని మోతాదును పెంచేందుకు ఈ లెగ్యుమినస్ జాతి పచ్చిరొట్ట పైరులు ఉపయోగపడతాయి. ఎకరానికి 20-50 కిలోల నత్రజనిని అందిస్తాయి. పంటలలో వ్యాధి నిరోధకశక్తిని పెంచుతాయి. సమస్యాత్మక భూముల (చౌడు) సాగుకు అనుకూలంగా మారుతాయి. పర్యావరణ కాలుష్యం లేకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తుంది. పంటల ఉత్పత్తులు, నాణ్యతను, రుచిని పెంచుతాయి.



పచ్చిరొట్ట పైరు



సత్యవాణి

జీలుగ ఎకరానికి 12కేజీల విత్తనం వాడితే 4.5 టన్నుల పచ్చిరొట్ట ఎరువుతో, 6.2 కేజీల నత్రజనిని, 1.5 కేజీల భాస్వరం, 5.1 కేజీల పొటాష్‌ను ఒకటన్ను పచ్చిరొట్ట ఎరువుకి చొప్పున భూమికి అందిస్తాయి.

జనుము ఎకరానికి 16 కేజీల విత్తనం వాడితే 4.6 టన్నుల పచ్చిరొట్ట ఎరువుతో టన్నుకు 7.5 కేజీల నత్రజని, 1.2 కేజీ భాస్వరం, 5.1 కేజీ పొటాష్‌ను అందిస్తుంది.

పిల్లిపెసర ఎకరానికి 8 కేజీల విత్తనం వాడితే 2.5 టన్నుల పచ్చిరొట్ట ఎరువుతో టన్నుకు 7.2 కేజీ నత్రజని, కేజీ భాస్వరం, 5.3 కేజీల పొటాష్ చొప్పున భూమికి అందిస్తుంది. కాబట్టి రైతులు ఈ పచ్చిరొట్ట పైర్లను పెంచి దమ్ము చేసి వరిలో నాణ్యమైన, అధిక దిగుబడులు పొందవచ్చు.

8283 క్వింటాళ్ల కేటాయింపు

ఎడగారు సీజన్‌కు సంబంధించి జిల్లాకు 8283 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాల కేటాయింపులు జరిగాయని జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి తెలిపారు. 3500 క్వింటాళ్ల జీలుగ, 2629 క్వింటాళ్ల జనుము, 2154 క్వింటాళ్ల పిల్లిపెసర అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని 50 శాతం సబ్సిడీ ధరకు రైతులకు అందించడం జరుగుతుందన్నారు. ఒక్కో రైతుకు 5ఎకరాలకు సరిపడా విత్తనాలు అందిస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గిరిజనులందరికీ 'ఆధార్'

- 18 వారాలపాటు ప్రత్యేక శిబిరాలు
- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మల్లికార్జునరెడ్డి

? జిల్లాలో గిరిజనులందరికీ ఆధార్ కార్డులు పంపిణీ చేయిస్తారా?

! జిల్లాలో ఆధార్‌కార్డు లేని గిరిజనులందరికీ ఆధార్ కార్డులు పంపిణీ చేయించడానికి అన్ని చర్యలు చేపట్టాం. జిల్లావ్యాప్తంగా 2.40లక్షల మంది గిరిజనులు ఉండగా, ఇప్పటివరకు 2.3 లక్షల మందికి ఆధార్‌కార్డులను ఇప్పించాం. ఇంకా 10వేల మందికి ఇప్పించాల్సి ఉంది. గిరిజనులకు సంబంధించి ముఖ్యంగా యానాదులు వలస వెళ్లి పనులు చేసుకోవడం వల్ల వారికి ఆధార్‌కార్డులు లేవు. అటువంటి వారందరికీ ఇప్పిస్తాం.

? ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తారా



! జిల్లాలోని 38 మండలాల్లో 18 వారాల పాటు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నాం. ఆగస్టు 15వతేదీ వరకు ఈ శిబిరాలు ఉంటాయి. ఆయా మండలాల్లో నివసిస్తున్న గిరిజనుల వద్దకే సచివాలయ సిబ్బంది వెళ్లి ప్రత్యేకంగా రూపొందించిన ఫార్మట్‌లో వాళ్ల వివరాలు తీసుకుని, స్వీయ ధ్రువీకరణ పత్రం తీసుకుంటారు. ఆ వివరాలను వీఆర్‌వో ద్వారా తహసీల్దారు, ఎంపీడీవోలకు తెలియసి, ఆధార్‌కార్డు వచ్చేలా చూస్తాం.

? ఆధార్‌కు బర్త్ సర్టిఫికెట్ అవసరం కదా

! ఆధార్‌కు తప్పనిసరిగా పుట్టిన తేదీ సర్టిఫికెట్ అవసరం. గిరిజనులలో యానాదులకు అవి లేవు. ఈ అంశమై ఆధార్ అథారిటీతో మాట్లాడి డోమిసైల్ సర్టిఫికెట్లు ఇప్పించేలా చర్యలు చేపట్టాం. ఇందుకు సంబంధించి డాక్యుమెంటేషన్ ప్రక్రియను ఎంపీడీవోలు, తహసీల్దార్లకు ఇచ్చాం. సచివాలయ సిబ్బంది సేకరించిన వివరాల ద్వారా గిరిజనులకు ఆధార్‌కార్డు అందేలా చూస్తున్నాం.

? ఆరేళ్లలోపు గిరిజన పిల్లలకు పుట్టిన తేదీ సర్టిఫికెట్ ఎలా ఇప్పిస్తారు

! 0-6 సంవత్సరాల వయసు గల గిరిజన పిల్లలకు ఆధార్ ముఖ్యం. ఈ పిల్లలందరికీ అంగన్‌వాడీ వర్కర్ల ద్వారా వివరాలు సేకరించి ఆధార్‌కార్డు అందేలా చేస్తున్నాం. డోమిసైల్ సర్టిఫికెట్ వీరికి వర్తించదు. ఎందుకంటే వీరు అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతుంటారు. వీరికి పుట్టిన తేదీ సర్టిఫికెట్ ఉంటుంది. అందుకనే నేరుగా వారికి ఆధార్ కార్డు అందేలా చేస్తాం. అలా కాకుండా వలస వెళ్లి ఎక్కడెక్కడో స్థిర నివాసం ఏర్పర్చుకున్న వారిని మాత్రమే డోమిసైల్ సర్టిఫికెట్ వచ్చేలా చేస్తున్నాం.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

తప్పుడు సర్టిఫికెట్ మంజూరు చేసిన వీఆర్‌వో సస్పెన్షన్

మర్రిపాడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తప్పుడు పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేసినందుకు వీఆర్‌వో రమణయ్యను జిల్లా కలెక్టరు ఆనంద్ మంగళవారం సస్పెండ్ చేశారు. ప్రయివేట్ బ్యాంకుల్లో రుణాలు తీసుకునేందుకు గ్రామంలో కొంత మంది తమ ఇళ్లను ఉదయగిరి రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయించుకున్నారు. ఈక్రమంలో ఇంటి పన్నుతో పాటు ఇంటి పొజిషన్ సర్టిఫికెట్ అవసరం కావటంతో గ్రామస్థులు వీఆర్‌వోని ఆశ్రయించారు. తమ ఇళ్లు ఉండే సర్వే నెంబర్ రిజిస్టర్ కానందున గ్రామనత్తంలో ఉన్న సర్వే నెంబర్‌లో ఇళ్లు ఉన్నట్లు తప్పుడు సర్టిఫికెట్లు మంజూరు చేశారు. దీంతో గ్రామస్థులు కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, విచారించి వీఆర్‌వో రమణయ్యను సస్పెండ్ చేసినట్లు కలెక్టరు వెల్లడించారు.

సౌర విద్యుత్‌పై అవగాహన పెంచుకోవాలి

- విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సౌర విద్యుత్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీరు (ఎస్ఈ) విజయన్ పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలో సోలార్ విద్యుత్ వినియోగాన్ని మంగళవారం ఆయన స్వయంగా పరిశీలించారు. వినియోగదారుల ఇళ్లకు వెళ్లి సోలార్ విద్యుత్ వినియోగం వల్ల ఎటువంటి లబ్ధి చేకూరిందో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్, అసిస్టెంట్ ఇంజనీర్ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సోలార్ విద్యుత్ వ్యవస్థను పరిశీలిస్తున్న ఎస్ఈ విజయన్

డైట్ అధ్యాపక పోస్టులకు నేటి నుంచి ఆన్‌లైన్ పరీక్ష

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పల్లిపాడు డైట్ కళాశాలలో అధ్యాపక ఖాళీలను డిప్యుటేషన్ పద్ధతిలో భర్తీ చేసేందుకు బుధ, గురువారాల్లో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్ష నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరుగుతుందని తెలిపారు. బుధవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఆల్ లాంగ్వేజెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, ఈవీఎస్, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు మ్యాథ్స్ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. 17వతేదీ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సైకాలజీ, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు ఫిలాసఫీ, సోషయాలజీ పరీక్షలుంటాయని తెలిపారు. అర్హులైన ఎస్ఏ, హెచ్ఎం, ఎంఈవోల నుంచి ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించి పరీక్ష వివరాలు తెలియ చేశామన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

న్యాయవాదుల సహకారం మరువలేనిది

- జిల్లా ప్రధాన న్యాయాధికారి యామిని



బార్ అసోసియేషన్ హాలులో మాట్లాడుతున్న న్యాయాధికారి యామిని

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : తన పదవీకాలంలో న్యాయవాదులు అందించిన సహకారం మరువలేనిదని జిల్లా ప్రధాన న్యాయాధికారి సీ యామిని అన్నారు. ఇటీవల బదిలీ అయిన ఆమె, ఫ్యామిలీ కోర్టు స్పెషల్ జడ్జి కే వెంకట నాగ పవన్ మంగళవారం నెల్లూరు న్యాయవాదుల బార్ అసోసియేషన్‌ను సందర్శించారు. ఉద్ధండులైన న్యాయవాదులను, న్యాయాధికారులను నెల్లూరు బార్ అసోసియేషన్ అందించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు ఉమామహేశ్వర్ రెడ్డి, సుందరయ్య యాదవ్, పలువురు న్యాయవాదులు, న్యాయాధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి.. ఎవరో వీధిలో పడేశారు!

- విచారించి చర్యలు తీసుకుంటాం : ఆర్డీవో

ఆత్మకూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా ఎన్నికల సామగ్రిని వీధిలో పడేశారని ఆత్మకూరు ఆర్డీవో బి.పావని అన్నారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. 2019 ఎన్నికలకు వినియోగించిన సామగ్రిని కార్యాలయంలో భద్రపరిచినట్లు చెప్పారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా ఆ సామగ్రిని తీసుకెళ్లి వీధుల్లో పడేశారని తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని, పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి నిందితులను గుర్తించి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కిసాన్ డ్రోన్ గ్రూపు సభ్యులకు నేడు అవగాహన, శిక్షణ

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కిసాన్ డ్రోన్ గ్రూపు సభ్యులకు బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో డ్రోన్లపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంకు అధికారులు, డ్రోన్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అవగాహన కల్పించి, అనుమానాలు నివృత్తి చేస్తారని తెలిపారు.

- పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం పుట్టగొడుగుల పెంపకంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జీ శివన్నారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9490004254 నెంబరును సంప్రదించాలని కోరారు.

21 నుంచి బీఎడ్ పరీక్షలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : బీఎడ్ 2022-24, 2023-25 బ్యాచ్‌ల అభ్యర్థులకు ఈనెల 21 నుంచి 26వతేదీ వరకు తొలి సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. అలాగే 2024-26 బ్యాచ్ అభ్యర్థులకు అదే తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థుల హాల్‌టికెట్లు ప్రభుత్వ పరీక్షల అధికారిక వెబ్‌సైట్ www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

అదీ.. కాకాణి నైజం : సోమిరెడ్డి

నెల్లూరు (వైద్యం) : తప్పులు చేయడం, పోలీసులకు చిక్కకుండా పోవటం కాకాణి గోవర్ధన్‌రెడ్డి నైజమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం నెల్లూరులో కోర్టు వాయిదాకు హాజరైన సోమిరెడ్డి మీడియాతో మాట్లాడారు. బెల్జియం, అమెరికా వంటి దేశాల్లో ఉన్న వారు సైతం పోలీసులకు చిక్కుతున్నా కాకాణి మాత్రం చిక్కటం లేదన్నారు. కాకాణి వంటి వ్యక్తి వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉండటం ఆ పార్టీ చేసుకున్న పాపమని దుయ్యబట్టారు. తోడేరు రెడ్డికి సంబంధం లేకుండా వరదాపురంలో రూ.వేలకోట్ల విలువైన క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ జరిగిందంటారా!? అంటూ ప్రశ్నించారు. కరోనా విపత్తుల సమయంలో ఆనందయ్య ఆయుర్వేద మందును వెబ్‌సైట్ ద్వారా అమ్మకానికి పెట్టిన నర్మదారెడ్డి తనపై అక్రమ కేసుకు సంబంధించి కోర్టుకు హాజరైనట్లు తెలిపారు.

తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా హుస్సేన్‌సాహెబ్

- మెప్మా పీడీగా లీలారాణి

నెల్లూరు (హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా హుస్సేన్‌సాహెబ్ నియమితులయ్యారు. డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న సాహెబ్‌కు పదోన్నతి లభించింది. అలాగే మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా అన్నమయ్య జిల్లా రాజంపేట ఎస్ఎస్‌సీలో పనిచేస్తున్న బి.లీలారాణిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కుల దూషణతో వివాహిత బలవన్మరణం

నెల్లూరురూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కులాంతర వివాహం చేసుకున్న ఓ యువతి మెట్టినింట్లో కుల వేధింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడింది. నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు అందించిన వివరాల మేరకు.. ముదివర్తిపాళెం గ్రామానికి చెందిన స్నైలీ (22) ఇందుకూరుపేటకు చెందిన నాగూరుబాబు ప్రేమించుకుని ఏడు నెలల క్రితం వివాహం చేసుకున్నారు. నెల్లూరులోని నవలాకుతోట వద్దనున్న మూడవ మైల్లో కాపురం ఉంటున్నారు. స్నైలీ అరుంధతీ వర్గానికి చెందిన యువతి కావడంతో ఇంట్లో నిత్యం కులం పేరుతో దూషిస్తుండటంతో వేధింపులు తాళలేక ఇంట్లోనే ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. కాగా, పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించిన స్నైలీ మృతదేహాన్ని రూరల్ తహసీల్దారు లాజరస్ పరిశీలించి పంచనామా వివరాలు నమోదు చేశారు.

క్రీడా శిబిరాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వేసవి క్రీడాశిక్షణ శిబిరాల నిర్వహణకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభి వృద్ధి అధికారి ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శాప్ ఆదేశాల మేరకు డీఎస్‌ఏ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మే నెల(వేసవి సెలవులు)లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వివిధ క్రీడాంశాల్లో శిక్షణ శిబిరాలను కోచ్‌లు, పీఈటీ, పీడీలు, అంతర్జాతీయ, జాతీయ స్థాయి సీనియర్ క్రీడాకారుల సహకారంతో నిర్వహిస్తామని తెలిపా రు. ఈ ఏడాది కూడా మే 1 నుంచి 31వతేదీ వరకు నిర్వహించే ఈ శిబిరాలకు అర్హత, ఆసక్తి కలిగిన ఆరు ఈనెల 17వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని డీఎస్‌ఏ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

రూ.కోట్లలో అవినీతి .. రూ.లక్షల్లో రికవరీ

ఉపాధి ఆడిట్ తీరుపై అనుమానాలెన్నో

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), (ఆంధ్రజ్యోతి): మండలంలోని 24 పంచాయతీల్లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి మంగళవారం స్థానిక కార్యాలయ ప్రాంగణంలో సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. రూ.10.97 కోట్ల నిధులతో చేపట్టిన పనులకుగాను ఇటీవల సోషల్ ఆడిట్ బృందాలు పంచాయతీల్లో సమగ్ర విచారణ చేపట్టి రూ.1,26,94,311 అవినీతి చోటుచేసుకున్నట్లు గుర్తించారు. కాగా ప్రజావేదికలో విచారణ చేపట్టిన డ్వామా పీడీ గంగా భవానీ కేవలం రూ.11,18,776 మాత్రమే రికవరీ విధించడం సర్వత్రా చర్చానీయాంశంగా మారింది. ప్రధానంగా నల్లబోతులవారిపల్లిలో మృతులకు మస్టర్లు వేసి నిధులు స్వాహా చేయడం, వరికుంటపాడులో మస్టర్లలో సంతకాలు,పని ప్రదేశాల్లో సమాచార బోర్డులు, జీ.కొండారెడ్డిపల్లిలో ఉద్యానశాఖ కింద నాటిన మొక్కలు, గోకులం షెడ్ ఆనవాళ్లు లేకపోవడం గుర్తించారు. అలాగే అధికశాతం పంచాయతీల్లో కొలతల్లో తేడా, బినామీ మస్టర్లు, అధిక నగదు చెల్లింపు తదితర అంశాలను డీఆర్పీలు బహిర్గతం చేశారు.

రికవరీలకు ఆదేశం

జీ.కొండారెడ్డిపల్లి పంచాయతీకి రూ.వెయ్యి, గణేశ్వరాపురం రూ.2,50,164, గువ్వాడి రూ.49,231, ఇస్కపల్లి రూ.20,978, జడదేవి రూ.1,07,043, కాంచెరువు రూ.3,000, టీ.కొండారెడ్డిపల్లి రూ.4,013, నార్త్ కృష్ణంరాజుపల్లి రూ.7,000, మహమ్మదాపురం రూ.25,939, ఎన్‌బీపల్లి రూ.2,17,989, నార్త్ కొండాయపాళెం రూ.3,500, పామూరుపల్లి రూ.5,461, పెద్దిరెడ్డిపల్లి రూ.1,68,766, రామాపురం రూ.7,712, తిమ్మారెడ్డిపల్లి రూ.1,386లు, టీసీపల్లి రూ.1,35,540, తూర్పుబోయమడగల రూ.32,270, తూర్పుచెన్నంపల్లి రూ.10,500, తూర్పురొంపిదొడ్ల రూ.4,500, వరికుంటపాడు రూ.44,840, వేంపాడు రూ.3,000, విరువూరు రూ.1,049, యర్రంరెడ్డిపల్లి రూ.13,633ల చొప్పున రికవరీ విధించడం జరిగింది. అలాగే అవినీతికి పాల్పడడంతో ఈసీ హజరత్, టీఏలు మూర్తి, శ్రీనివాసులను తాత్కాలికంగా సస్పెండ్ చేయడం జరిగింది.



ప్రజావేదిక నిర్వహిస్తున్న డ్వామా పీడీ గంగాభవాని

క్రీడా శిబిరాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వేసవి క్రీడాశిక్షణ శిబిరాల నిర్వహణకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభి వృద్ధి అధికారి ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శాప్ ఆదేశాల మేరకు డీఎస్‌ఏ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మే నెల(వేసవి సెలవులు)లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వివిధ క్రీడాంశాల్లో శిక్షణ శిబిరాలను కోచ్‌లు, పీఈటీ, పీడీలు, అంతర్జాతీయ, జాతీయ స్థాయి సీనియర్ క్రీడాకారుల సహకారంతో నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఏడాది కూడా మే 1 నుంచి 31వతేదీ వరకు నిర్వహించే ఈ శిబిరాలకు అర్హత, ఆసక్తి కలిగిన ఆరు ఈనెల 17వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని డీఎస్‌ఏ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

డిగ్రీ పరీక్షలకు 572 మంది గైర్హాజరు

వెంకటాచలం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో మంగళవారం జరిగిన డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షలకు 572 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 9433 మంది విద్యార్థులకు గాను 8861 మంది హాజరయ్యారు.

నవధాన్యాలు సాగు చేయాలి

కోవూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వరి పంట కోసిన తరువాత నవధాన్యాలు సాగుచేయాలని ఏపీ సీఎన్ఎఫ్ డీపీఎం మునిరత్నం కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం' అంశంపై జరిగి సదస్సులో ఆయన మాట్లాడారు. నవధాన్యాలు సాగుచే యడం వల్ల భూమి సారవంతమవు తుందన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని అలవరచుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో వ్యవసాయాధికారులు సుజాత, ఇందిరావతి, సుబ్బరాజు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8965
వెండి కిలో ధర	రూ. 98,000
వెండి ఒక గ్రాము	రూ.101.00

న్యూస్ బాక్స్

బియ్యం లారీ పట్టివేత

కోవూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కావలి నుంచి చెన్నై నగరానికి వెళ్తున్న బియ్యం లారీని జాతీయ రహదారిపై కోవూరు సమీపంలో పౌరసరఫరాల శాఖాధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని లారీలో తరలిస్తున్నారనే అనుమానంతో అడ్డుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అన్ని అనుమతులతో సాధారణ బియ్యాన్ని చెన్నై నగరానికి తీసుకువెళ్తున్నామని లారీ యజమాని వివరించినప్పటికీ బియ్యాన్ని పరీక్షకు పంపారు. ప్రభుత్వం పంపిణీకి సిద్ధం చేసిన బియ్యం కాదని తేలడంతో తాము కేసు నమోదు చేయలేదని ఏఎస్ఐ రషీద్ తెలిపారు. లారీని ఉన్నతాధికారుల విచారణ అనంతరం విడుదల చేయనున్నట్లు వివరించారు.

● చికెన్ వ్యర్థాల వాహనం

బెంగళూరు నుంచి కోవూరు పరిసర ప్రాంతాల్లోని చేపల గుంతల్లో వేసేందుకు తీసుకువచ్చిన చికెన్ వ్యర్థాల వాహనాన్ని పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ రషీద్ తెలిపారు.

ఇనమడుగులో 'పోషణ్ పక్వాడా'



కోవూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇనమడుగు అట్టల కాలనీలో మంగళవారం వైద్యఆరోగ్య శాఖ 'పోషణ్‌పక్వాడా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ తల్లి ఆరోగ్యం బాగుంటే కుటుంబ ఆరోగ్యం బాగుంటుందని చెప్పారు. పోషకాహారం తీసుకుంటే రక్తహీనత సమస్య తలెత్త దన్నారు. చిన్నారులకు రెండేళ్ల వయస్సు వచ్చేంత వరకు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పోషకాహారాన్ని సమయా నికి తీసుకుని విశ్రాంతిగా ఉంటే శారీరక మానసిక రుగ్మతలు తలెత్తవని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వా డీలు, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. రక్తహీనత నివారణకు హోమియో మందులు పంపిణీ చేశారు.

మైనింగ్ అనుమతులు రద్దు చేయండి

● కందలపాడులో రైతుల ఆందోళన

వెంకటాచలం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని మండలంలోని కందలపాడు గ్రామంలో రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. రైతులు మాట్లాడుతూ గ్రామంలోని కొండ పోరంబోకు సర్వే నెంబరు 57లో సుమారు 90 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన సుమారు 100 రైతు కుటుంబాలు నిమ్మ తోటలు, కూరగాయలు, వరి పొలాలను సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నాయన్నారు. పలుమార్లు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాలు ఇచ్చి తమ గోడును చెప్పుకున్నామన్నారు. తమకు జీవనోపాధి ఆ పొలాలేనని, వాటి జోలికి వస్తే తాము పురుగుల మందు తాగి చనిపోతామని హెచ్చరించారు. వెంటనే మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ జయంతి వేడుకల్లో అపశ్రుతి



గాయపడిన శ్యామ్

విడవలూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): విడవలూరు దళిత కాలనీలో సోమవారం జరిగిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో అపశృతి జరిగింది. అంబేడ్కర్ విగ్రహం ప్రారంభోత్సవం సందర్భంగా అభిమానులు బాణా సంచా కాలుస్తూ ర్యాలీని నిర్వహిం చారు. స్థానిక అంకమ్మ దేవాలయం సెంటర్ వద్ద బాణాసంచా సామగ్రికి నిప్పు అంటుకుని వాహనంలో ఉన్న టపాకాయ లు ఒక్కసారిగా పేలడంతో గ్రామానికి చెందిన జి. శ్యామ్‌కి తీవ్ర గాయాలయ్యా యి. దీంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రవేట్ అసుపత్రికి తరలించారు.

● ఎమ్మెల్యే పరామర్శ

విషయం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆసుపత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులపై వైద్యులతో చర్చించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి : ఎంపీడీవో

వెంకటాచలం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించాలని నిర్ణయించిందని ఎంపీడీవో కల్పన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు రుణాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే 10 చివరి తేదీ అని తెలిపారు. అలాగే గ్రామ సచి వాలయాల్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రవాణా, పరిశ్రమలు, సేవా, వ్యాపార రంగాల్లో స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ లబ్ధిదారులు వినియోగిం చుకోవాలని సూచించారు.

భూముల రీసర్వేపై అవగాహన

ముత్తుకూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణపట్నంలో మంగళవారం భూముల రీసర్వేపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా తహసీల్దారు స్వప్న మాట్లాడుతూ భూములకు సం బంధించిన సమస్యలను తక్షణం పరిష్కరించుకోవచ్చన్నారు. భూముల రీసర్వే ప్రక్రియపై రైతులు, భూయజమానులకు రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు, సర్వేయర్ అనురూప్, టీడీపీ నాయకులు యేకొల్లు కోదండయ్య, రాగాల శివ కృష్ణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌తో పారిశ్రామికాభివృద్ధి

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



విలియమ్స్‌పేటలో ఆటోనగర్‌కు భూమిపూజ చేస్తున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): విలియమ్స్‌పేటలో ఆటోనగర్ ఏర్పాటు చేయడం అంటే బుచ్చిరెడ్డిపాళెంలో పారిశ్రామిక అభివృద్ధికి నాంది అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నాగమాంబాపురం పంచాయతీ విలియమ్స్‌పేటలో ఆటోనగర్ ఏర్పాటుకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వీపీఆర్ ట్రస్టు నిధులతో ఆటోనగర్ ఏర్పాటయ్యే 7.30 ఎకరాల భూమిలో గుంతలు, మిట్టలు చదును చేయనున్నట్టు తెలిపారు. ఆటో నగర్ ఏర్పాటుకు సంబంధిత శాఖల అధికారులు సహకరించారన్నారు. రాష్ట్ర చరిత్రలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం 24 గంటల్లో ప్రతి రైతుకూ, హమాలీలకూ వారి ఖాతాలకు నగదు జమచేసిన ఏకైక సీఎం చంద్రబాబు నాయుడేనని కొనియాడారు. కోవూరు నియోజకవర్గం నుంచి జిల్లాలోనే ఎక్కువగా 38వేల టన్నులు ధాన్యం ప్రభుత్వానికి అందించామన్నారు. భవిష్యత్ రోజుల్లో ఉపాధిలో కోవూరు నియోజకవర్గం ముందుకెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీహరి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, శివరామకృష్ణారెడ్డి, ఎంపీపీ శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యంనాయుడు, కత్తి మహేష్, రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో ప్రజలు బెంబేలు

● పోలీసుల పనితీరుపై విమర్శలు

వెంకటాచలం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల జరుగుతున్న వరుస చోరీలతో గ్రామస్థులు బెంబేలెత్తుతున్నారు. మండలంలో కసుమూరు మస్తాన్‌వలీ దర్గా, గొలగమూడి భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమం, విక్రమ సింహపురి యూనివర్సిటీతో పాటు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, టూరిజం కళాశాల, సీఆర్‌సీ (మానసిక దివ్యాంగుల ప్రాంతీయ కేంద్రం) ఇలా ప్రముఖ కేంద్ర విద్యా సంస్థలు, ప్రముఖ పరిశ్రమలు ఉన్నాయి. అలాంటి వెంకటాచలం మండలంలో గడిచిన ఏడాది కాలంలో 40కిపైగా ఇళ్లల్లో, ఆలయాల్లో చోరీలు జరిగాయి. అలాగే పొలాల్లో 20కి పైగా వ్యవసాయ మోటార్లు సైతం చోరీచేశారు. ప్రధానంగా వెంకటాచలం, కనుపూరు, కసుమూరు, కాకుటూరు, ఎర్రగుంట గ్రామాలే లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. రాత్రయితే చాలు తాళాలు వేసిన ఇళ్లల్లో చోరీలు జరుగుతున్నాయి. దొంగలు పగలు అంతా రెక్కీ చేసుకుని ఒక పథకం ప్రకారం చోరీలు చేస్తున్నారు. వెంకటాచలం పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే దొంగతనాలు జరిగాయి. కానీ ఇప్పటివరకు వెంకటాచలం పోలీసులు ఒక్క దొంగను కూడా పట్టుకున్న దాఖలాలు లేవు. చోరీకి గురైన సొత్తు రికవరీ చేయలేదు. ఏడాది కాలంలో ఒకటి రెండు దొంగతనం కేసులు మాత్రం పోలీసులు ఛేదించారే తప్ప వరుస చోరీలకు అడ్డుకట్టవేయలేక పోతున్నారు. ఈక్రమంలో ప్రజలు ఇళ్లు వదిలి ఊర్లకు వెళ్లాలంటేనే ఆందోళన చెందుతున్నారు.

గ్రామాల్లో క్షేత్రస్థాయి గస్తీ కరువు


వరుస చోరీలు జరుగుతున్న ఆ ఐదు గ్రామాలతోపాటు మిగిలిన గ్రామాల్లో గస్తీ కరువైందనే చెప్పవచ్చు. గ్రామాల్లోని అన్ని వీధుల్లో పోలీసులు గస్తీ చేయకుండా ప్రధాన వీధుల్లో మోటర్‌బైక్ వేసుకుని వెళ్లిపోతున్నారు. కొన్ని వీధుల్లో వీధి దీపాలు వెలగక పోవడంతో అంధకారం నెలకొని దొంగలు చోరీలు చేసేందుకు సులువుగా మారుతోంది. కొందరు పోలీస్ సిబ్బంది మాత్రం గస్తీ చేయకుండా జాతీయ రహదారిపై పశువులు ఇతర వాహనాల నుంచి చిల్లర దండకాలు, మరి కొందరు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లల్లో బియ్యం వంటి అక్రమ రవాణా చేసే వారి నుంచి మామూళ్లు దండుకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కొందరు పోలీసులు మాత్రం తమ గస్తీ విధులు నిజాయితీగా నిర్వర్తిస్తున్నారు. గ్రామాల్లోని అన్ని వీధుల్లో రాత్రులు గస్తీ అత్యంత పకడ్బందీగా చేసినట్లయితే దొంగతనాలు జరగవని గ్రామస్థులు పేర్కొంటున్నారు.



వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై విరిగిపోయి నేలచూపు చూస్తున్న నిఘా నేత్రం

నిఘానేత్రాల నేల చూపు

మండలంలోని పలు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి, ప్రముఖ పుణ్యక్షేత్రాలు, అధిక జనసంచారం ఉన్న ప్రాంతాల్లో ఇటీవల పోలీసులు నిఘా నేత్రాలను ఏర్పాటు చేశారు. కానీ వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన నిఘా నేత్రాల్లో ఒకటి మాత్రం గత కొద్ది రోజుల నుంచి విరిగిపోయి వేలాడుతోంది. ఇలా అయితే నేరస్థులను ఎలా గుర్తిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిఘా నేత్రాలు ఏర్పాటు చేయడం కాదని, వాటి పనితీరు ఎలా ఉందో అప్పుడప్పుడు పరిశీలించుకుంటూ దొంగతనాలను నివా రించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వెంకటాచలంలో ఇటీవల చోరీ జరిగిన శ్రీకృష్ణుడి ఆలయం

బటన్ నొక్కడం కాదు.. రాష్ట్రం గొంతునొక్కాడు : సోమిరెడ్డి



సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, ముదిగేడు గ్రామస్తులు

పొదలకూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల అభివృద్ధి పేరుతో బటన్ నొక్కడం కాదని రాష్ట్రం గొంతు నొక్కాడని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ముదిగేడు గ్రామంలో రూ.25 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే ప్రారం భోత్సవాలు చేశారు. సబ్సిడీ వ్యవసాయ పనిముట్లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆనం, నేదురుమల్లి రాజకీయాలు చేసే సమయంలో ఎన్నో పోరాటాలు చేశామని, ఒక చిన్న కేసులేదని రాక్షసపాలనలో తమపై అక్రమంగా 18 కేసులు బనాయించారని గుర్తు చేశారు. కాకాణి చేసిన పాపాలు శాపాలుగా వెంటాడుతున్నాయని దుయ్యబట్టారు. ముదిగేడు సర్పంచ్ పెద్దమల్లు శ్రీనివాసులు రెడ్డితోపాటు 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

దంతాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

కోవూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బాలలు, వృద్ధులు దంతాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ వైద్యశాల దంతవైద్యురాలు వీ జ్యోతిప్రభ అన్నారు. స్థానిక దళిత కాలనీలోని మండల పరిషత్ పాఠశాలలో మంగళవారం వరల్డ్ ఓరల్ హెల్త్ డే మాసోత్సవాలను పురస్కరించు కుని నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి దినం రెండు పర్యాయాలు దంతధావనం సక్రమంగా చేసుకోవాలన్నారు. టూత్ బ్రష్‌ను ఉపయోగించి పళ్లు తోముకునే విధానాన్ని ఆమె వివరించారు. అనంతరం శాంతినగర్‌లోని వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు దంతపరీక్షలు చేసి ఉచితంగా బ్రష్‌లు, పేస్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని అరుణ, వైద్యసిబ్బంది పుష్ప, శాలిని పాల్గొన్నారు.

చెత్త సేకరించే ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

ఇద్దరు పారిశుధ్య కార్మికులకు గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాఘవ రెడ్డి కాలనీ ప్రాంతంలో మంగళవారం వేకువజామున చెత్త సేకరించుకుని ముంబై జాతీయ రహదారిపై వస్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న ఇద్దరు పారిశుధ్య కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను బుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం దశయ్యను నెల్లూరులోని నారాయణ ఆసుపత్రికి తరలిం చారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, మురళి దంపతులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, ఆసుపత్రిలో కార్మికులను పరామర్శించారు. అలాగే ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆసుపత్రికి వెళ్లి బాధి తులను పరామర్శించారు. బాధితులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. చైర్‌పర్సన్ సుప్రజ, టీడీపీ నాయకులు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, వంశీకృష్ణారెడ్డి, కమలాకర్‌రెడ్డి, సత్యంరెడ్డి, శివకుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రికి రూ.లక్ష విరాళం



బుచ్చి ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారికి రూ.1లక్ష చెక్కు అందజేస్తున్న దొడ్ల కోదండరామిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇన్వర్టర్ ఏర్పాటు కోసం దొడ్ల వరదయ్య, రుక్మిణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.లక్ష విరాళం అందజేశారు. దానికి సంబంధించిన చెక్కును మంగళవారం ఆసుపత్రి వైద్యాధి కారి డాక్టర్ పద్మజకు మాజీ ఎంపీపీ దొడ్ల విజయలక్ష్మి భర్త ఆసుపత్రి కమిటీ మెంబర్ కోదండ రామిరెడ్డి అందజేశారు. తక్షణం ఇన్వర్టర్ కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మల ప్రసాద్, దుగ్గిశెట్టి హరనాథ్, కౌన్సిలర్ రాచూరి సత్యం, సొల్లేటి ప్రభాకర్, పొన్నపోలు సుమన్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ముత్తుకూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మదేవం, ఎస్టీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులు, చిన్నపిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేస్తోందన్నారు. పౌష్టికాహారం ఆవశ్యకతను అంగన్‌వాడీ సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజ్యలక్ష్మీ, హరికుమారి, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత మినగల్లు కోనేటిమిట్ట ప్రాంతానికి చెందిన బండి సంజీవయ్య(77) నెల్లూరులో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. ఈనెల 10వ తేదీన సంజీవయ్య మినగల్లులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దేవిస్‌పేటలో ఉచిత కంటి వైద్య శిబిరం

ఇందుకూరుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దేవిస్ పేటలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇక్కడి జైన్ దేవాలయం నిర్వాహకులు దీపక్ జైన్ ఆధ్వర్యంలో 15రోజుల పాటు నిర్వహి స్తున్న అంతర్జాతీయ ఆధ్యాత్మిక కార్యక్ర మాల సందర్భంగా పలు రాష్ట్రాలు, జిల్లాల నుంచి విచ్చేసిన భక్తులకు మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ బ్రహ్మేశ్వర్ నాయుడు, డాక్టర్ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యాధి కారిణి శశికళ కంటి పరీక్షలు నిర్వహిం చారు. ఈ కార్యక్ర మంలో హెల్త్ ఎడ్యు కేటర్ సుధాకర్‌రావు, హెల్త్ అసిస్టెంట్ మాధవ, ఏఎన్ఎం కెరోలిన్, ఆశా వలంటీరు సుజాత, తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S



సీజ్ చేసిన టిప్పర్లు

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న మూడు టిప్పర్ల సీజ్

పొదలకూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుపూరు నుంచి నెల్లూరుకు అక్రమంగా గ్రావెల్ రవాణా జరుగుతోందన్న సమచారం మేరకు తహసీల్దారు శివకృష్ణయ్య తన సిబ్బందితో కలిసి దాడులు జరిపి మూడు టిప్పర్లను సీజ్ చేశారు. సీజ్ చేసిన టిప్పర్లను పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పారు. ఈదాడుల్లో ఆర్ఐ అశ్వత్ నారాయణ, వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య

● భర్త వేధింపులే కారణమంటున్న కుటుంబ సభ్యులు



పూర్ణిమ మృతదేహం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో నెల్లూరులోని పతేఖాన్‌పేటలో ఉన్న పోలీస్ క్వార్టర్స్‌లో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల సమాచారం మేరకు.. ఒంగోలు ప్రాంతానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ బీ నాగరాజుకు గతంలో వివాహం జరిగి ఇద్దరు పిల్లలున్నారు. భార్య మృతి చెందడంతో. ఈ విషయమై నాగరాజుపై ఒంగోలులో కేసు నడుస్తోంది. జిల్లాల విభజనలో భాగంగా నాగరాజు ఒంగోలు నుంచి నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. తొమ్మిది నెలల క్రితం పొదిలి ప్రాంతానికి చెందిన పూర్ణిమను రెండో వివాహం చేసుకున్నారు. రెండు నెలల క్రితమే వారు పత్తేఖాన్‌పేటలోని పోలీసు క్వార్టర్స్‌లో కాపురం పెట్టారు. భార్యాభర్తల మధ్య గొడవల నేపథ్యంలో మంగళవారం ఉదయం పూర్ణిమ ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ఫ్యానుకి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి పత్తేఖాన్‌పేట వీఆర్‌వో మహేష్‌కు సమాచారం అందించారు. ఆయన సమాచారంతో చిన్నబజారు పోలీసులు అక్కడికి చేరుకొని తలుపులు పగులగొట్టి పూర్ణిమ మృతదేహాన్ని కిందకు దించారు. పోస్టుమార్టం నిమ్మి తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్ణిమ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భర్త వేధింపులు తట్టుకోలేకే ఆమె ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : భర్తపై అలిగి ఓ వివాహిత ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని కిసాన్ నగర్‌లో షేక్ నసీర్, నస్రీన్ దంపతులు నివసిస్తున్నారు. నస్రీన్ భర్తపై అలిగి ఈ నెల 5వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో నసీర్ నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

వరకట్నం కేసు నమోదు

వెంకటాచలం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన భర్త అత్త, మామ, వదినలతో కలిసి అదనపు కట్నం తీసుకురావాలని చిత్రహింసలు పెడుతున్నారని బాధితురాలు తురక అనూష పోలీసులకు మంగళవారం ఫిర్యాదుచేసింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని తిక్కవరప్పాడు గ్రామానికి చెందిన తురక అనూషకు ఏడాది క్రితం వెంకటాచలం పంచాయతీ వడ్డిపాళెం గ్రామానికి చెందిన తురక లోకేష్‌తో వివాహం జరిగింది. అయితే భర్త లోకేష్ మద్యానికి బానిసై మామ హరిబాబు, అత్త హరిత, వదిన ఉషలతో కలిసి చిత్ర హింసలు పెడుతూ అదనపు కట్నం తీసుకుని రావాలని వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో పోలీసులు మంగళవారం వరకట్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● వరకట్నం కేసు..

అదనపు కట్నం కోసం తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని బాధితురాలు ఉప్పు లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని రామదాసుకండ్రిగ పంచాయతీ నాయుడు పాళెం గ్రామానికి చెందిన ఉప్పు లావణ్యకు అదే గ్రామానికి చెందిన ఉప్పు శ్రీహరితో వివాహం జరిగింది. అయితే తన భర్త అత్త ఉప్పు రమణమ్మ, బెల్లకొండ పావని, బెల్లకొండ మురళీలతో కలిసి చిత్రహింసలు పెడుతున్నాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో పోలీసులు మంగళవారం వరకట్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

వెంకటాచలం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొలగమూడి గ్రామంలో మంగళవారం అనుమానాస్పద స్థితిలో ఒక వృద్ధుడు మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. కోవూరి సూరిబాబు (67) కాలేయ వ్యాధితో బాధపడుతూ ఒంటరిగా నివసిస్తున్నాడు. అయితే స్థానికులు అతను మృతిచెందినట్లుగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనారోగ్య కారణంగానే మృతిచెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి ..

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కసుమూరు గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాల మేరకు కసుమూరు గ్రామానికి చెందిన బిరుదోలు చిన్నయ్య (54) కట్టెలు కొట్టేందుకు చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కిందపడి పోయాడు. దీంతో అతన్ని చికిత్స కోసం నెల్లూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి బంధువులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య బిరుదోలు రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మునిగి..

వెంకటాచలం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురిచెర్లపాడు చెరువులో ప్రమాదవశాత్తు ఒక వ్యక్తి మునిగి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కురిచెర్లపాడు పంచాయతీ వీవర్స్ కాలనీకి చెందిన మోహన్ (54) ఆదివారం పొలం వద్దకు వెళ్తున్నటు ఇంటి వద్ద చెప్పి వెళ్లాడు. అయితే సోమవారం సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో మంగళవారం మోహన్ కురిచెర్లపాడు సమీపంలో ఉన్న చెరువులో మృతదేహమై కనిపించాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 420

ఉపాధ్యాయుడు నరేంద్రకు జాతీయ అవార్డు



నెల్లూరు(విద్య), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీబీఆర్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కే నరేంద్రకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు లభించింది. విద్యారంగంలో విశేష సేవలందిస్తున్నందుకు గుంటూరు సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ వారు గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. పాఠశాల డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సహచర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

న్యూస్ బాక్స్

త్వరలో ఒక్క రూపాయికే యూజీడీ కనెక్షన్

● కమిషనర్ సూర్యతేజ



అల్లీపురం డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 15, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు వాసులకు త్వరలో ఒక్క రూపాయికే భూగర్భ డ్రైనేజీ కనెక్షన్ అందచేస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ తెలిపారు. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో యూజీడీ, తాగునీటి పైపులైన్ల నిర్మాణ పనులను, అల్లీపురం డంపింగ్ యార్డును ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ యూజీడీ పనులు పూర్తి చేసి కాలుష్య రహిత నగరంగా నెల్లూరును తయారు చేయనున్నామని చెప్పారు.. ప్రతీ ఇంటికి కనెక్షన్ ఇవ్వడం వల్ల బహిరంగ మురుగు కనిపించదని, తద్వారా దోమల బెడద ఉండదన్నారు. అనంతరం పొట్టేపాళెం వద్ద నిర్మాణంలో ఉన్న ఎస్టీపీని పరిశీలించారు. వెంగళరావు నగర్ అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

నేటి నుంచి 'నారాయణ'లో అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు



మీడియా సమావేశంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తదితరులు

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల క్రికెట్ పోటీలు నగరంలోని నారాయణ వైద్య కళాశాలలో బుధవారం నుంచి జరుగుతాయని ఆ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మంగళవారం వైద్య కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 20వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని, రాష్ట్రంలోని 38 వైద్య, దంత కళాశాలలకు చెందిన 800 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రారంభోత్సవానికి ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఎస్‌వీఎల్ నరసింహం హాజరవుతారన్నారు. విలేకరుల సమావేశంలో నారాయణ విద్యాసంస్థల కోఆర్డినేటర్ డాక్టర్ బిజు రవీంద్రన్, స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ స్కంద గోపాల కృష్ణ, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సెల్విబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలోని సత్యసాయి సేవా ట్రస్ట్‌లో మంగళవారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోగుల సహాయకులకు అన్నప్రసాద వితరణ చేశారు. అసోసియేషన్ సభ్యుడు భీమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి తల్లి రమణమ్మ వర్ధంతి సందర్భంగా అన్నదానం చేసినట్లు సంఘం అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పొన్నం రవిచంద్ర, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, నేతలు కొండారెడ్డి, గోపాల్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతిని బెదిరించి బంగారు గొలుసు దోపిడీ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలోని వైన్‌షాప్ వద్ద యువతిని బెదిరించి ఆమె మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి లాక్కెళ్లాడు. పోలీసుల సమాచారం మేరకు... జిల్లాలోని మర్రిపాడు గ్రామానికి చెందిన రీమాశేఖర్ నగరంలోని వీఆర్‌సీ వద్ద ఓ హాస్టల్‌లో ఉంటూ నారాయణ వైద్యశాలలో బయోమెడికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 11వ తేదీ స్నేహితుడు అశోక్‌కుమార్ తో చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డులో మాట్లాడుతుండగా గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఎవరు మీరు? ఇక్కడ ఏమి చేస్తున్నారు? మీ తల్లిదండ్రులకు ఫోన్ చేయండి అంటూ బెదిరించాడు. వెంటనే నీ మెడలోని చైను తీసివ్వు లేకుంటే చంపేస్తాను అంటూ బెదిరించడంతో రీమాశేఖర్ భయపడి తన మెడలోని ఒక్కటిన్నర సవర బంగారు చైను తీసిచ్చింది. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి బైక్‌పై పరారయ్యాడు. బాధితురాలు కుటుంబ సభ్యులకు విషయం తెలిపి మంగళవారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కే సాంబశివరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అశ్వవాహనంలో వేణుగోపాలుడు



నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం అభిషేకాలు, పూజలు, వెన్నతాళి అలంకారంలో స్వామి వారికి పేట ఉత్సవం జరిగాయి. సాయంత్రం పూలంగి సేవ, విశేష పూజలు జరిగాయి. రాత్రి నగరోత్సవంలో శ్రీవారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ధర్మకర్తలు, ఈవో సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

● ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం గంగాళ తిరుమంజనం కన్నుల పండువగా జరిగింది. సాయంత్రం విశేష పూజలు, పూలంగిసేవ, అనంతరం అశ్వవాహనంపై నగరోత్సవం జరిగాయి. పత్తి జయరామయ్య నాయుడు, మోదెం మల్లికార్జునరావు, ఈవో జీ దుర్గయ్య పాల్గొన్నారు.

● సంతపేట ఆంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఉదయం అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం పూలంగి సేవ, పూజల అనంతరం స్వామివారికి ఊంజల్ సేవ కన్నుల పండువగా జరిగింది. ఈవో రఘురామయ్య పర్యవేక్షించారు.



శబరి రాముడికి ఏకాంతసేవ



నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి స్వామివారికి ఏకాంత సేవ జరిగింది. ఉదయం అభిషేకాలు, సాయంత్రం బ్యాండు కచేరీ, పల్లకీసేవ నిర్వహించారు. భారతీ సంగీత విద్యాలయం రమాదేవి శిష్య బృందం ఏకాంతసేవకు లాలి పాటలను వీనుల విందుగా ఆలపించారు. ఉభయకర్తలుగా అన్నం దయాకర్ గౌడ్, సుబ్బరత్నం వ్యవహరించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, చంద్రారెడ్డి, రాజు పర్యవేక్షించారు.

● **ముగిసిన బ్రహ్మోత్సవాలు**

నగరంలోని బాలాజీనగర్ సీతారామ మందిరంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు ఉదయం అభిషేకాలు, విశేష అలంకార పూజలు జరిగాయి. అనంతరం ఉత్సవమూర్తులకు వసంతోత్సవం కన్నుల పండు వగా జరిగింది. ఉభయకర్తలు, ఆలయ ధర్మకర్తలు, భక్తులు కూడా వసంతాలు పోసుకున్నారు. సాయంత్రం విశేష పూలంగిసేవ, పూజలు జరిగాయి. రాత్రి ఏకాంతసేవతో ఉత్సవాలు ముగిశాయి.

కరెంటు కార్లుండీ అద్దె మోత

- పనిచేయని నాలుగు విద్యుత్ కార్లు
- మరమ్మతులను పట్టించుకోని అధికారులు
- ప్రైవేటు వాహనాలకు రూ.వేలల్లో అద్దె
- ఎల్లోబోర్డు పేరిట వైట్‌బోర్డుకు చెల్లింపులు
- అభ్యంతరం చెప్పని స్క్రూట్నీ విభాగం

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 15, (ఆంధ్రజ్యోతి) : ఏ ప్రభుత్వ సంస్థ అయినా నిత్య కార్యకలాపాలకు సొంత వాహనాలేనే వాడుకోవాలనుకుంటుంది. కానీ నెల్లూరు కార్పొరేషన్ అధికారులకు మాత్రం సంస్థ వాహనాలున్నా అద్దె వాహనాలే ముద్దు. ఇందుకోసం ప్రతీ నెల రూ.వేలల్లో బిల్లులు చెల్లిస్తున్నారు. నగర పాలక సంస్థకు 15 విద్యుత్‌కార్లున్నాయి. వీటి ని ఎస్‌ఈ నుంచి డీఈఈల వరకు వివిధ హోదాలు కలిగిన అధికారులకు కేటాయించారు. కానీ ప్రస్తుతం వీటిల్లో నాలుగు పనిచేయడం లేదు. మిగిలినవి వాడుకలో ఉన్నాయి. ఇదే సాకుగా చూపిన అధికారులు అద్దె వాహనాలను పెట్టుకుని నెలకు రూ. 35 వేల నుంచి 45 వేల వరకు చెల్లిస్తున్నారు. వైట్‌బోర్డులున్న కార్లకు ఎల్లోబోర్డుల పేరిట నెలనెల చెల్లింపులు జరుగుతున్నాయి. స్క్రూటినీ చేయాల్సిన అధికారులు సైతం పచ్చజెండా ఊపడం అనుమానాలకు దారితీస్తోంది.



కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో చార్జింగ్ తీసుకుంటున్న విద్యుత్ కార్లు

వీవీఎస్ మూర్తి కార్పొరేషన కమిషనర్‌గా ఉండగా 2019లో మహీంద్రా కంపెనీకి చెందిన 15 విద్యుత్ కార్లను కొనుగోలు చేశారు. వీటికి ఆరేళ్లపాటు నెలకు రూ. 20 వేల చొప్పున ఈఎంఐ చెల్లించేవిధంగా ఒప్పందం చేసుకుని ఐదేళ్లపాటు వారంటీ తీసుకున్నారు. వీటిని ఎస్‌ఈ, ఏడీసీ, డీసీ, ముగ్గురు ఈఈలు, సీపీ, డీసీపీ, ఏసీపీలు ఇద్దరు, ఎంహెచ్‌వో, ఎగ్జామినర్, ఆర్వో, ఇద్దరు డీఈఈలకు కేటాయించారు. 2023 వరకు ఈ వాహనాలనే ఉపయోగించారు. ఇందులో నాలుగు వాహనాలు మరమ్మతులకు గురవడంతో అద్దె వాహనాలపై మోజు పెంచుకున్న అధికారులు వాటిని ఉపయోగించడం మొదలుపెట్టారు. ఇలా ఎస్‌ఈ, ఏడీసీ, డీసీ, సీపీ, ఎంహెచ్‌వో, ఆర్వో, ఉద్యాన అధికారి, అమృత డీడీలకు ప్రస్తుతం రూ. 35-45 వేల వరకు నెలనెల అద్దె చెల్లించి ప్రైవేట్ వాహనాలను ఉపయోగిస్తున్నా రు. ముగ్గురు ఈఈలు, ఇద్దరు ఏసీపీలు, ఎగ్జామినర్, ఇద్దరు డీఈఈలు, కమిషన ర్ బంగ్లా రిజర్వుకింద ఒకటి మాత్రమే ఎలక్ట్రికల్ వాహనాలు వాడుతున్నారు. వీటిని కొనుగోలు చేసి ఐదేళ్ల కాలం పూర్తవడంతో కంపెనీ వారంటీని ఆపే సింది. కాగా ఆరేళ్ల వరకు కుదుర్చుకు న్న ఒప్పందం ప్రకారం కారుకి రూ. 20 వేలు చొప్పున ఈఎంఐని కార్పొరేష న్ చెల్లిస్తూనే ఉంది.

● **నిబంధనలకు తూట్లు**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అయిల్ రహిత వాహనాలను ఉపయోగించాలని, ఆ మేరకు భారీ రాయితీలను ప్రకటిస్తూ ప్రోత్సాహకాలు అందిస్తుంటే నెల్లూరు కార్పొరేషన్ అధికారులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఆయిల్ రహితంగా విద్యుత్ వాహనాలున్నప్పటికీ వాటిని పక్కన పెట్టేసి ఆయిల్‌తో నడిచే ప్రైవేట్ వాహనాలను ఉపయోగించడం విమర్శలకు దారితీస్తోంది. ఆరేళ్లపాటు ఒక్కో వాహనానికి రూ. 20 వేలు ఈఎంఐ చెల్లించుకుంటూ వస్తుండగా ప్రస్తుతం అద్దెకు తిరుగుతున్న వాహనాలకు నెలనెల రూ. 35 వేల నుంచి రూ.45 వేలు అదనంగా చెల్లింపులు చేయడం గమనార్హం. విద్యుత్ వాహనాలకు మరమ్మతులు చేయిస్తే కార్పొరేషన్‌పై ఈ భారం తగ్గుతుంది. ఆ దిశగా అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉంది.

స్క్రూట్నీ అధికారి ఏం చేస్తున్నట్టు?

కార్పొరేషన్‌లో అధికారులు అద్దె కింద వాడుతున్న కార్లు వైట్‌బోర్డుతో ఉన్నాయి. ఈ లెక్కన వీటికి ప్రభుత్వం నుంచి రూపాయి కూడా అద్దె కింద చెల్లించాల్సిన అవసరంలేదు. కానీ కాగితాల్లో మాత్రం ఎల్లోబోర్డుల కింద చూపి ప్రతీ నెల అద్దె చెల్లిస్తున్నారు. ఇలాంటి వాటిని ఎత్తిచూపాల్సిన స్క్రూట్నీ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. బిల్లులు చెల్లించేటప్పుడు ప్రతీ కాగితాన్ని స్రూటినీ అధికారి క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది. కానీ, అధికారులు వాడుతున్న వైట్‌బోర్డు కార్లకు ఎల్లో బోర్డు పేరుతో చెల్లింపులు చేస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. నిధుల వినియోగం విషయంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.



కార్పొరేషన్ కార్యాలయం ముందు బైఠాయించిన కార్మికులు

కార్మికుల సమస్యలు పట్టవా..?

● కార్పొరేషన్ కార్యాలయ ముట్టడిలో నాయకులు

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 15, (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికుల సమస్యలను పట్టించుకోరా...? అంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు మంగళవారం నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడించారు. ఉదయం నుంచి కార్యాలయం ముందు బైఠాయించి అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. నాయకులు కత్తి శ్రీనివాసులు, మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పారిశుధ్య విభాగంలో ఏళ్ల తరబడి పని చేస్తున్న 93 మంది కార్మికులను 60 ఏళ్లు దాటాయంటూ నిర్దాక్షిణ్యంగా తొలగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం, నోటీసులు లేకుండా విధుల్లో నుంచి తీసేయడం సరికాదన్నారు. ఇప్పటి వరకు మరణించిన పారిశుధ్య కార్మికుల వారసులెవరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని, కనీసం నష్టపరిహారం కూడా చెల్లించలేదని ఆరోపించారు. పనిముట్లు, ఇతర వస్తువులను కార్మికు లు వారి సొంత డబ్బుతో కొనుగోలు చేసుకుంటున్నారని చెప్పారు. సమస్య లను పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరిం చారు. అనంతరం కమిషనర్ సూర్యతేజ, ఏడీసీ నందన్‌కు వినతిపత్రాలు అంద చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీ నాగేశ్వరరావు, కొండా ప్రసాద్, పెంచల నరసయ్య, సూర్య నారాయణ, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరురోడ్డు పనులకు ఆటంకం రానివ్వొద్దు : ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 15, (ఆంధ్రజ్యోతి) : నగరంలో పొదలకూరురోడ్డు నిర్మాణ పనులకు ఆటంకం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధికారులకు సూచించారు. నగరంలోని ఆయన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షించారు. రహదారి నిర్మాణ పనులు వేగంగా జరిగేందుకు వీలైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నగర కమిషనర్ సూర్యతేజ, అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే, పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో రూరల్ తహసీల్దారు లాజరస్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, రూరల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 303 అభివృద్ధి పనులు మే 20 నాటికి పూర్తి కావాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. 21, 22 డివిజన్లలో నిర్మాణంలో ఉన్న పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. పనులు వేగంగా జరిగేందుకు స్థానిక టీడీపీ నాయకులు బాధ్యత తీసుకోవాలని కోరారు.

'అగ్నివీర్' రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

నెల్లూరు (హరనాథపురం) : అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ రిజిస్ట్రేషన్ గడువును ఏప్రిల్ 25 వరకు పొడిగించినట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. అగ్నివీర్‌లోని వివిధ కేటగిరీలలోకి రిక్రూట్‌మెంట్ కోసం రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ ద్వారా చేయవచ్చని తెలిపారు. ఒక అభ్యర్థి అగ్నివీర్‌లో రెండు వేర్వేరు కేటగిరీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తిగల వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీచ్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

● మంత్రి దుర్గేష్‌ను కోరిన జనసేన నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సముద్ర తీర ప్రాంతాల్లోని బీచ్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను జనసేన పార్టీ జిల్లా నాయకులు కోరారు. మంత్రిని మంగళవారం రాజధానిలోని కార్యాలయంలో జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ నగర అధ్యక్షుడు సుజయ్‌బాబు మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం, తుమ్మలపెంట, మైపాడు, కొత్తకోడూరు, కృష్ణపట్నం, తూపిలిపాలెం, శ్రీనివాసనత్రం బీచ్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు. పర్యాటక రంగంలో రాష్ట్రంలోనే జిల్లాను ప్రత్యేకమైనదిగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్, ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లిశెట్టి శ్రీధర్, కావలి ఇన్‌చార్జి అలహరి సుధాకర్, సూళూరుపేట ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, కోవూరు ఇన్‌చార్జి చప్పిడి శ్రీనివాసులురెడ్డి, సర్వేపల్లి సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, గూడూరు సమన్వయ కర్త మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి దుర్గేష్‌తో జనసేన పార్టీ జిల్లా నాయకులు

హోరాహోరీగా టీ-20 క్రికెట్ సెమీ ఫైనల్స్

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో బుజబుజ నెల్లూరులోని సీఏపీ క్రీడామైదానంలో జరుగుతున్న సింహపురి ప్రీమియర్ లీగ్ టీ-20 క్రికెట్ పోటీల్లో మంగళవారం సెమీఫైనల్స్ హోరాహోరీగా జరిగాయి. తొలి మ్యాచ్‌లో గూడూరు రాయల్ చాలంజర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 210 పరుగులు సాధించింది. మహీప్ కుమార్ 109 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. అనంతరం బరిలోకి దిగిన నెల్లూరు రూరల్ లయన్స్ జట్టు 19.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని చేధించి ఫైనల్స్‌కు చేరుకుంది. ఈ జట్టులోని ధీరజ్ 71 పరుగులు, అశ్విన్ హెబ్బార్ 53 పరుగులతో జట్టు విజయానికి కృషి చేశారు. మధ్యాహ్నం జరిగిన రెండో సెమీఫైనల్స్‌లో కోవూరు నైట్‌రైడర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 212 పరుగులు సాధించింది. ఈ జట్టులోని లేఖజ్‌రెడ్డి 76, ఫర్హాద్ ఖాద్రి 75 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కావలి సన్‌రైజర్స్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 202 పరుగులు మాత్రమే సాధించడంతో కోవూరు విజయం సాధించింది. బుధవారం గూడూరు రాయల్ చాలెంజర్స్, కోవూరు నైట్ రైడర్స్ జట్లు ఫైనల్స్ కోసం తలపడనున్నాయి. పోటీలను టోర్నీ నిర్వాహక కమిటీ చైర్మన్ కే వంశీ కుమార్, నవాజ్‌ఖాన్, ఏసీఏ అంపైర్లు పర్యవేక్షించారు.



మహీప్ కుమార్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందచేస్తున్న టోర్నీ నిర్వాహకులు

బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో అగ్నిమాపక వారోత్సవం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది మంగళవారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్లు, గ్యారేజ్‌లు, రైల్వే స్టేషన్లలో అవగాహన సదస్సులు నిర్వహించారు. అగ్నిప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయాణికులు, సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎస్ఎఫ్ మస్తాన్‌రావు, కే రామకృష్ణ, వై స్వరూప్ కుమార్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



ఆర్టీసీలో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

'అపోలో'లో తక్కువ ఖర్చుతో మోకీలు మార్పిడి శస్త్రచికిత్స

● ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, డాక్టర్ వివేకానందరెడ్డి

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అపోలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు అతి తక్కువ ఖర్చుతో నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, ఆర్థోపెడిక్ సీనియర్ సర్జన్ డాక్టర్ వివేకానందరెడ్డి వెల్లడించారు. ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధునాతన రోబోటిక్ మోకా లి మార్పిడి శస్త్రచికి త్స చేస్తున్నామని ఇది 100 శాతం సురక్షితమని తెలియచేశారు. శస్త్రచికిత్స అనంతరం ఎక్కువ రోజులు ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. నగరంలో అపోలో ఆసుపత్రి ప్రారంభించి 10 ఏళ్లయిన సందర్భంగా మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను రూ.2.50 లక్షలకే చేస్తున్నా మని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియో గం చేసుకోవాల ని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శశిధర్‌రెడ్డి, యూనిట్ హెడ్ బాల రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామ్ సతీష్

రాజరాజేశ్వరి ఆలయంలో భక్తిశ్రద్ధలతో కళాపకర్షణ పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో కళాపకర్షణ పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ, విమాన గోపురం జీర్ణోద్ధరణ, సాలహార నిర్మాణం, నవగ్రహ, మండప పునర్నిర్మాణం, స్తంభ వర్గాల ఏర్పాటు, దక్షిణం వైపు ప్రహరీగోడ త దితర పనులు ప్రారంభించేందుకు కంచి పీఠ ఆస్థాన సిద్ధాంతి, ఋత్వికుల ఆధ్వర్యంలో ఈ పూజలు చేశా రు. ఉభయదాతలుగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి, ఆల్తూరు సులోచనమ్మ, ఆల్తూరు గిరీష్‌రెడ్డి, లత, ఆల్తూరు మహేష్‌రెడ్డి, రాధిక వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామమూర్తి, ఈవో సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.



అంకురార్పణ పూజలు చేస్తున్న ఈవో జనార్దన్‌రెడ్డి



మెరుపు తీగ

మేఘావృతమైన ఆకాశం. ఉరుముల శబ్దం. కళ్లు బైర్లుకమ్మేలా మెరుపులు. పిడుగులు పడతాయేమోనన్న ఆందోళన. చివరకు చినుకు పడలేదు. ఆ మెరుపుల మధ్యన మంగళవారం రాత్రి తిరుపతి నగరం ఇలా కనిపించింది.

ఫోరా.. సిక్సా..!

జోరుగా ఐపీఎల్ బెట్టింగ్

- అడ్డాగా హోటళ్లు, అద్దె ఇళ్లు, శివారు ప్రాంతాలు
- ఈజీ మనీ కోసం భవితను పాడు చేసుకుంటున్న యువత



ఈ బాల్ ఫోర్ పోతుందా? సిక్సర్ కొడతాడా.. అంటూ బంతి బంతికీ బెట్టింగ్.

సెంచరీ కొట్టే బ్యాట్స్‌మన్ ఎవరు? ఎక్కువ వికెట్లు తీసే బౌలరు.. గెలిచే జట్టు ఏదీ.. అంటూ మ్యాచ్‌పైనా బెట్టింగు.

ఇలా శివారు ప్రాంతాలు, హోటళ్లు, అద్దె ఇళ్లు కేంద్రంగా జిల్లాలోని పలుచోట్ల ఐపీఎల్ క్రికెట్ పోటీల్లో బెట్టింగ్ జోరగా సాగుతోంది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఈజీ మనీ కోసం అలవాటు పడిన కొందరు బెట్టింగ్‌వైపు అడుగులేస్తున్నారు. ఆర్థికంగా చితికిపోయి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ఐపీఎల్ క్రికెట్‌లో బెట్టింగ్ కాసి.. ఎందరో దెబ్బతిన్నారు. ఒకప్పట్లో తిరుపతిలాంటి నగరాలకే పరిమితమైన ఈ బెట్టింగ్.. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాతో పల్లెలకూ పాకింది. జిల్లాలో కొందరు స్థానికంగానే బెట్టింగ్‌లు కొనసాగిస్తున్నారు. ఇంకొందరు విజయవాడ, బెంగళూరు, చెన్నై, గుంటూరు, ఒడిశా, ఉత్తరప్రదేశ్ లాంటి నగరాల్లో ఉన్న వారితో సంబంధాలు ఏర్పాటు చేసుకుని ఏజెంట్లను నియమించుకుని ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు జరుపుతున్నట్లు సమాచారం. దీనికోసం మండల కేంద్రాలతో పాటు కొన్ని గ్రామాల్లో దూరంగా ఉండే ఇళ్లను అద్దెకు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇక, శివారు ప్రాంతాలు, ఏకాంత కాలనీల్లో టీవీతో పాటు మద్యం, ఇతర సదుపాయాలు కల్పించి క్రికెట్ బెట్టింగ్‌లు ఆడిస్తున్నట్లు తెలిసింది. మరికొందరు ల్యాప్‌టాప్‌లు, ఫోన్ల ద్వారా నేరుగా బెట్టింగ్‌లు సాగిస్తున్నారు. తిరుపతి, తిరుచానూరు, సత్యవేడు, తలకోన, ఎర్రావారిపాలెం, ఆరణి, విజయపురం, నాయుడుపేట, గూడూరు లాంటి శివారు ప్రాంతాల్లో క్రికెట్ బెట్టింగ్‌లు జరుపుతున్నట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. గతంలో అయితే మ్యాచ్ విజయావకాశాలపై బెట్ వేసేవారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగు యాప్‌లు రావడంతో బంతి బంతికి.. ప్రతి ఓవర్‌కూ పరుగులు, వికెట్లు, నోబాల్స్, వైడ్ బాల్స్.. ఇలా అన్ని రకాలుగా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. ఈ బెట్టింగ్‌లో కొంత డబ్బు పోగొట్టుకోగానే ఎలాగైనా తిరిగి సంపాదించాలన్న భావనతో మరింత పందెం కడుతున్నారు. ఇలా.. చివరకు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇలాంటి ఘటనలు ఇటీవల ఎక్కువగానే కనిపిస్తున్నాయి. కాగా, ఐపీఎల్ సీజన్ ప్రారంభంలోనే నిఘాతో స్థానిక బెట్టింగ్ జరిగే ప్రాంతాలను చాలావరకు కట్టడి చేసినా.. ఆన్‌లైన్ బెట్టింగ్‌ను ఆపడం అసాధ్యంగా మారుతోందని పోలీసులు వర్గాలు చెబుతున్నాయి.

రెండు వారాల్లో విచారణ పూర్తి

మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్



అధికారులతో సమావేశమైన ఆర్డీ విశ్వనాథ్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలపై విచారణలో భాగంగా ఆర్డీ విశ్వనాథ్ మంగళవారం కార్యాలయానికి విచ్చేశారు. పలు కీలక ఫైళ్లను పరిశీలించారు. మరో రెండు వారాల్లో విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని స్పష్టం చేశారు. కడప జిల్లా ప్రొద్దుటూరు, చిత్తూరు, తిరుపతి కార్పొరేషన్లలో జరిగిన విచారణ నివేదికలను ప్రభుత్వానికి అందించామన్నారు. 2015 సంవత్సరంలో నగరి మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా బాలాజీనాథ్ యాదవ్ ఉన్న సమయంలో పెన్షన్ పంపిణీలో అవకతవకలు జరిగాయి. అప్పటి నుంచే విచారణ కొనసాగుతోంది. ప్రస్తుత నగరి కమిషనర్ కృష్ణారెడ్డి మంగళవారం ఆర్డీకి సదరు దస్త్రాలు అందజేశారు. అవకతవకలు ఇంకా తేలకపోవడం గమనార్హం. అలాగే ఏపీ ఎంఎంఎస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామయ్య మంగళవారం పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీకి వినతిపత్రం సమర్పించారు. రాయలసీమ జోన్ పరిధిలోని మున్సిపాలిటీల్లో పనిచేసే మేనేజర్లు, ఆర్వోల పట్ల కమిషనర్లు దురుసుగా వ్యవహరిస్తున్నారని విన్నవించారు. పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, ఈఈ సుబ్బరాయులు, కమిషనర్ మంజునాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విచారణలో తీవ్ర జాప్యం

అవినీతి ఆరోపణలపై కమిటీ చేపట్టిన పునర్విచారణలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఫిర్యాదు మేరకు అత్యవసరంగా కమిటీని ఏర్పాటు చేసి పునర్విచారణ చేపట్టారు. కమిటీ విచారణ ప్రారంభించి నెల రోజులకు పైగా కావస్తున్నా పురోగతి లేకుంది. కమిటీలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, ఈఈ సుబ్బరాయులు ఇతర అధికారులు ఉన్నారు. వేసవిలో నీటి ఎద్దడిని అధిగమించే బాధ్యత పబ్లిక్ హెల్త్ విభాగంకు ఉండటంతో జిల్లా స్థాయి అధికారులు బిజీగా గడుపుతున్నారు. ఈ క్రమంలో విచారణలో జాప్యం జరుగుతోంది. పుత్తూరు మున్సిపాలిటీలో స్క్రాప్ వేలం విషయంలో లోతుగా విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

రెండు ప్రాజెక్టులకు పచ్చజెండా

- భారీ సౌర విద్యుత్, అమోర్ఫస్ మెటల్ ప్లాంట్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం

తిరుపతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాను పారిశ్రామికంగా బలోపేతం చేసే దిశగా రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ప్రభుత్వం జిల్లాకు సంబంధించి రెండు కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. చిల్లకూరు మండలం తమ్మినపట్నం, తూర్పు కనుపూరు, వెల్లపాలెం గ్రామాల్లో కోట మండలం కర్లపూడి, సిద్ధవరం గ్రామాల పరిధిలో 700 మెగావాట్ల భారీ సౌర విద్యుత్ ప్రాజెక్టు నెలకొల్పడానికి చింత గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ముందుకొచ్చింది. ఈ ప్రతిపాదనకు మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. అలాగే శ్రీసిటీ పరిధిలో అమోర్ఫస్ మెటల్ తయారీ ప్లాంటు ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతూ ప్రొటేరియల్ లిమిటెడ్ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. దీనిపై కూడా మంత్రివర్గం సానుకూలంగా స్పందించింది. ఆమోదం తెలిపింది.

రేపటి వరకు పాలిసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఏపీ పాలిసెట్-25 ఆన్‌లైన్ దరఖాస్తు గడువు గురువారం వరకు పొడిగించినట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 30న ప్రవేశపరీక్ష జరుగుతుందని, ఆబ్జెక్టివ్ విధానంలో 120మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుందని, గణితంలో 50ప్రశ్నలు, ఫిజిక్స్‌లో 40, కెమిస్ట్రీలో 30చొప్పున ప్రశ్నలు ఉంటాయని వివరించారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈపరీక్షకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 86888 88802/03, 93999 76999 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'స్పోక్' కోసం భవనాల పరిశీలన



ఏర్పేడులో స్థలాలకు సంబంధించి మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

రేణిగుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అనుసంధానంగా ఏర్పాటు కానున్న స్పోక్ (సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్) మోడల్ భవనం గుర్తింపు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. స్పోక్ భవనం కోసం మంగళవారం ఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, ఐటీఈపీఓ ప్రతినిధి దీప్తి, అమరరాజా, అదానీ సంస్థల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఏపీని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు చేశారన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఐదు సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ హబ్‌లు ఏర్పాటు చేయనున్నారని, అందులో తిరుపతి ఉందన్నారు. ఇక్కడ ఏర్పాటు చేయనున్న స్పోక్‌లో టెక్నాలజీ ఆవిష్కరణలకు ముందుకు వచ్చే విద్యార్థులకు అన్ని విధాల సహకారం అందించి నూతన ఆవిష్కరణలకు దోహదపడేలా చేస్తామన్నారు. అదానీ, అమరరాజా, నవయుగ పరిశ్రమలు, తిరుపతి ఐఐటీ సహకారంతో టెక్నాలజీ ఆవిష్కరణల కోసం కొత్త ఆలోచనలతో వచ్చే విద్యార్థులకు సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లో సహకారం అందిస్తామని చెప్పారు. తిరుపతి స్పోక్ హబ్‌లో నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆర్కిటెక్చర్ మణి సందీప్, అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ సీవోవో రాజన్‌బాబు, నవయుగ సీఈవో సుబ్బారావు, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, ఏర్పేడు తహసీల్దార్ భార్గవి తదితరులు పాల్గొన్నారు. ఏర్పేడులో స్థలాలను కలెక్టర్ పరిశీలించారు.



అధికారులతో మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

మామిడి పండ్లను సహజంగా మగ్గపెట్టాలి

రసాయనాలు వినియోగిస్తే క్రిమినల్ చర్యలు : జేసీ

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): 'వరిగడ్డి, కార్బోర్ బాక్సు, పేపర్ బ్యాగ్స్‌ను ఉపయోగించి సహజసిద్ధంగా మామిడి పండ్లను మగ్గపెట్టాలి. అనుమతుల్లేని కాల్షియం కార్బైడ్‌ను ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు పెట్టాల్సి వస్తుంది' అంటూ వ్యాపారులను జేసీ శుభం బన్సల్ హెచ్చరించారు. పండ్లు మగ్గపెట్టడం కాల్షియం కార్బైడ్‌ను నిరోధించడంపై కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మామిడి పండ్ల సీజన్ మొదలవుతున్న కారణంగా ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలతో మామిడి పండ్లు మగ్గపెట్టే ప్రక్రియను నిరోధించడంపై ఆయన అధికారులతో చర్చించారు. కమిటీలోని సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. దీనిపై పండ్ల వ్యాపారులకూ అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, డీపీవో సుశీలాదేవి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వర్ రావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దిలేటి, ఫుడ్ సేఫ్టీ అధికారి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచీ ఎస్వీయూ పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచీ ప్రారంభం కానున్నాయి. తొలుత ఈ నెల 15వ తేదీ నుంచీ ఈ పరీక్షలు నిర్వహించాలని భావించారు. అయితే 24వ తేదీ నుంచీ పరీక్షలు చేపట్టాలని తాజాగా నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను పరీక్షల అధికారి దామ్లా నాయక్ ప్రకటించారు. ఈ నెల 29వ తేదీ నాటికి పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ముగియనున్నాయి. పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

తిరుమలలో దారితప్పుతున్న డ్రైవర్లు

- కొందరి తీరుపై పెరగుతున్న ఫిర్యాదులు



తిరుమల, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై కొంతమంది ట్యాక్సీ డ్రైవర్లు దారి తప్పుతున్నారు. భక్తులతో అమర్యాదగా నడుచుకోవడం, మద్యం, గంజాయి తాగడం, తోటి డ్రైవర్లతో గొడవలు పడుతుండటం వంటి చర్యలతో వివాదాలకు తెరలేపుతున్నారు. ఇటీవల పార్కింగ్ అంశంలో ముగ్గురు డ్రైవర్ల దాడిలో గాయపడిన ఓ డ్రైవర్ మృతి చెందిన సంగతి తెలిసిందే. కొండమీద దాదాపు 2,500కు పైగాట్యాక్సీలు ఉన్నాయి. 6 వేల మందికిపైగా డ్రైవర్లు వీటిపై ఆధారపడి బతుకుతున్నారు. చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు వంటి ఇతర జిల్లాల వారూ తిరుపతి- తిరుమల మధ్య ట్యాక్సీలు నడుపుతున్నారు. ఇటీవల కొందరు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మందిని ట్యాక్సీల్లో ఎక్కించుకుంటున్నారు. అతివేగంతో వాహనాలను నడుపుతున్నారు. రాత్రి వేళ కొందరు మైనర్లే నడిపేస్తున్నారు. భారీ శబ్దాల హారన్లతో మోతెక్కిస్తున్నారు. భక్తులతోనూ కొందరు అమర్యాదగా నడుచుకుంటున్నారనే ఫిర్యాదులు తరచూ అందుతున్నాయి. పార్కింగ్ ప్రాంతాల్లో తామే భక్తులను వాహనాల్లో ఎక్కించుకోవాలని కొంతమంది బృందాలుగా మారి నిత్యం ఘర్షణలకు దిగుతున్నారు. ప్రీపెయిడ్ ట్యాక్సీ సిస్టమ్ పెడతామన్న టీటీడీ, పోలీసులు ప్రకటనకే పరిమితమయ్యారు. ఇప్పటికైనా టీటీడీ ఉన్నతాధికారులు, ట్రాఫిక్, పోలీసు, విజిలెన్స్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి.



డ్రైవర్లతో మాట్లాడుతున్న పోలీసులు

ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు

ట్రాఫిక్ పోలీసులు మంగళవారం తిరుమల పార్కింగ్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ట్యాక్సీ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గొడవలు పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మితిమీరితే లైసెన్సులను సీజ్ చేయడంతో పాటు వాహనాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

భూమనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

- ఎస్పీకి టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి పిర్యాదు



ఎస్పీ హర్షవర్ధనరాజుకు ఫిర్యాదు చేస్తున్న భానుప్రకాష్‌రెడ్డి, సామంచి తదితరులు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలు దెబ్బతీస్తూ గోశాలలో గోవుల మరణాలపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి చేస్తున్న అసత్య ప్రచారాలపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పలువురు బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, పార్టీ నాయకులు అజయ్‌కుమార్, డాక్టర్ శ్రీహరి, ఆముదాల ఓంప్రకాష్‌లు ఈమేరకు జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజును కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం భానుప్రకాష్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎస్వీ గోశాలలో 100 గోవులు మరణించాయని, గోశాలను గో వధశాలగా మార్చారంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్న కరుణాకర రెడ్డిపై ఐటి యాక్టు 74, బీఎన్ఎస్ యాక్టు 365 కింద కేసు నమోదు చేయాలని కోరారు. ఆయన చైర్మన్‌గా ఉన్న సమయంలో 45 లేగదూడలు, 34 గోవులు చనిపోయిన విషయం మరచిపోయారా అని ప్రశ్నించారు. అనారోగ్యం, వయసురీత్యా చనిపోతున్నా దుష్ప్రచారాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. వైసీపీ హయాంలో గోవులకు పురుగులు పట్టిన ఆహారం, కాలం చెల్లిన మందులు వాడారని ఆరోపించారు. టీటీడీ పరిధిలో వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలన్నిటిపై చర్యలు తీసుకుంటామన్నారు. బీహార్ కంటే వైసీపీ హయాంలో జరిగిన దాణా స్కాం పెద్దదన్నారు. భవిష్యత్తులో టీటీడీపై ఆధారాలు లేకుండా అసత్య ప్రచారాలు చేసేవారిపై చర్యలు తీసుకునేలా త్వరలో బోర్డులో నిర్ణయం తీసుకుంటామని భానుప్రకాష్ రెడ్డి తెలిపారు.

శ్రీసిటీలో 'వందే భారత్' స్లీపర్ బోగీల ఇంటీరియర్ పనులు

శ్రీసిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): 'వందే భారత్' స్లీపర్ ఎక్స్‌ప్రెస్ కోసం వివిధ వ్యవస్థలను రూపొందించడం, రైలు పెట్టెల్లో అమర్చడం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును తిరుపతి జిల్లా శ్రీసిటీలోని బీఎఫ్‌జీ ఇండియా చేపట్టింది. ఈ ప్రాజెక్టులో 16 కోచ్‌ల రైలు కోసం ఇంటీరియర్స్, మాడ్యులర్ టాయిలెట్ క్యాబిన్లు, ఏరోడైనమిక్ ఫ్రంట్ ఎండ్‌ల రూపకల్పన, తయారీ, ఇన్‌స్టాల్ చేయడం వంటి పనులను ఈ కంపెనీకి అప్పగించారు. ఈ రైలులో 823 బెర్తులు, 51 టాయిలెట్లు ఉంటాయి. కాగా, ప్రపంచస్థాయి ప్రమాణాలతో తేలికైన, మన్నికైన ఉత్పత్తులతో రైల్వే మౌలిక సదుపాయాలను కల్పించే విప్లవాత్మక వందే భారత్ స్లీపర్ ప్రాజెక్టులో భాగం కావడం తమకు గర్వకారణమని బీఎఫ్‌జీ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కె.ప్రేమమూర్తి తెలిపారు.



జస్టిస్ మురళి పురుషోత్తమన్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మురళి పురుషోత్తమన్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఉన్నారు.



పరిటాల సునీత

సర్వదర్శనానికి 11 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 11 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని అన్ని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.58 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,078

తలనీలాలు సమర్పించినవారు: 25,831

తిరుపతి కళాకారులకు 'కందుకూరి' అవార్డులు

- శాంభోళ హరినాథ్, కృష్ణమూర్తి, వివేక్ ఎంపిక
- నేడు విజయవాడలో పురస్కారాల ప్రదానం

తిరుపతి, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కందుకూరి అవార్డులకు తిరుపతికి చెందిన ముగ్గురు రంగస్థల కళాకారులు ఎంపికయ్యారు. కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతి వేడుకలు, తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి పురస్కారాలకు శాంబోళ హరనాథ్, కృష్ణమూర్తి, పత్తిపాటి వివేక్‌ను ఎంపిక చేసినట్టు మంగళవారం ఏపీఎఫ్‌డీసీ ప్రకటించింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం జరిగే తెలుగు నాటకరంగ దిన వేడుకల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పురస్కారాలు అందజేయనున్నారు. ఒక్కొక్కరికి రూ10వేలు జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సన్మానించనున్నారు.



భళా శాంభోళ

శాంభోళ హరినాథ్ ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయుడు. కానీ, ఆయన కళాకారుడిగానే అందరికీ పరిచయం. 1976లోనే వేషం వేసుకుని ప్రథమ బహుమతి పొందారు. హాస్యాన్ని అలవోకగా, ఆశువుగా చెప్పగల చమత్కారి. అతను వేదిక ఎక్కితే నవ్వువచ్చేస్తుంది. అలాగని హాస్యానికే పరిమితం కాలేదు. కొన్ని సాంఘిక నాటికల్లో కన్నీరు తెప్పించిన అనేక పాత్రలను పోషించి విభిన్న నటుడిగా గుర్తింపు పొందారు. బెస్ట్ కమెడియన్‌గా అవార్డులు అందుకున్నారు. ఆయనకు వచ్చిన జ్ఞాపికల కోసం ఓ గదిని అద్దెకు తీసుకొని, అందులో అందంగా పేర్చి వాటిని చూసుకుంటూ ముచ్చటపడుతుంటారంటే రంగస్థలంపై ఆయనకున్న ప్రేమను తెలియజేస్తుంది.



కళా కృష్ణమూర్తి

ఎంకాం, ఎంబీఏ పూర్తిచేసి స్విమ్స్ కాంట్రాక్ట్ ఉద్యోగిగా ఉన్నారు. అక్కడ పనిచేసే 8 గంటలూ రోగుల సేవలోనే ఉంటారు. బయటకు వస్తే నటన గురించే ఆలోచిస్తారు. తొలినాటకం 'భక్త కన్నప్ప'లో నటించారు. 'పాండవోద్యోగ విజయం'లోని ఉపప్లావ్య ఘట్టంలో తొలిసారిగా కృష్ణుడి పాత్ర వేశారు. చెంచితలో చెంచునాయుడు పాత్రలో కృష్ణమూర్తి ఒదిగిపోయారు. 'తరిగొండ వెంగమాంబ' నాటకంలో శివగురు పాత్రతో విలనిజం చూపించారు. బుల్లితెరపై మొగలిరేకులు, హరిలోరంగహరి, కుమ్మరి భీమన్న, భీష్మ, అపార్ట్‌మెంట్ వంటి సీరియల్స్ చేశారు. పేరుకు తగ్గట్టే శ్రీకృష్ణుడు, కుసాలన్న పాత్ర, కాళహస్తి మహత్యంలో కాశీపాత్ర (హాస్యం) గుర్తింపు తెచ్చాయి. తరిగొండ వెంగమాంబ, పాండవోద్యోగం నాటకాలు పేరు తెచ్చాయి.



మైమ్ స్టార్ వివేక్

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ సాంస్కృతిక కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్. విద్యార్థిగా ఉన్నప్పుడే మైమ్‌స్టార్‌గా పేరుతెచ్చుకున్నారు. 2022లో 'నాటిక' రచనకు బంగారు నంది అవార్డు అందుకున్నారు. విశ్వవిద్యాలయాల మధ్య జరిగే అనేక సాంస్కృతిక పోటీల్లో వివేక్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. మైమ్ ద్వారా అద్భుతమైన సందేశాలిచ్చేవారు. ఇటీవల వర్సిటీలో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. అందులోని విజేతలను, దక్షిణ భారత విశ్వవిద్యాలయాల్లో ఎస్వీయూను అగ్రస్థానంలో నిలిపారు. ఎస్వీయూ చరిత్రలో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచారు.

ధాన్యంపైనా సూర్యప్రతాపం

- అధిక ఉష్ణోగ్రతల్లో ఆరబెడితే నష్టమే
- అధికంగా ఎండితే బియ్యం ముక్కలయ్యే అవకాశం
- కొంత పచ్చిగా ఉన్నప్పుడే పంటకోత మేలంటున్న వ్యవసాయ అధికారులు



తేమ శాతం తగ్గించేందుకు ఎండలో ఆరబెట్టిన ధాన్యం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తూర్పు మండలాల్లో రబీ వరి కోతలు ప్రారంభమయ్యాయి. ధాన్యం అమ్మకాలకు రైతులు సిద్ధపడుతున్నారు. 17 శాతం వరకు తేమ ఉన్న ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేందుకు రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో పచ్చిగా ఉన్నప్పుడే అమ్ముకుంటే గిట్టుబాటు ధర రాదని భావిస్తున్న రైతులు.. ధాన్యాన్ని ఎండలో బాగా ఆరబెట్టి తేమను తొలిగించే పనిలో పడ్డారు. కోత దశకు వచ్చిన పంటను కోత కోసి వచ్చిన ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. సరిగ్గా ఇదే తరుణంలో ఈ ఏడాది మార్చి నుంచే ఎండల తీవ్రత అధికంగా ఉంటోంది. సూళ్లూరుపేట ప్రాంతంలో దాదాపు 35 నుంచి 40 డిగ్రీల సెల్సియస్ వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇటువంటి వాతావరణ పరిస్థితుల్లో ధాన్యం అధికంగా ఎండిపోయే అవకాశం ఉంటుంది. ఇదే జరిగితే బియ్యం ముక్కలయ్యే అవకాశం ఏర్పడుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. దీని వల్ల రైస్ మిల్లర్లు ధాన్యం తీసుకోవడానికి నిరాకరించే అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- వరి కంకుల్లో 90 శాతం గింజలు పసుపు రంగుకు మారుతున్నప్పుడు, కర్ర పచ్చిగా ఉండగానే పంట కోయాలి.
- పంట పక్వానికి వచ్చాక కోత ఆలస్యం చేయకూడదు.
- పంటను ముందుగా కోస్తే ధాన్యంలో పచ్చి గింజలు ఎక్కువగా ఉండి మిల్లింగ్ సమయంలో అధికంగా నూక వస్తుంది.
- ఎండ తక్కువ తగిలే చోట ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలి.
- 17 శాతం తేమ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ధాన్యం ఎక్కువగా ఎండినా బియ్యంలో నూక శాతం ఎక్కువ అవుతుంది.



ఆరిన ధాన్యం రాశులు



ఆరబెట్టేందుకు ట్రాక్టర్‌లో తీసుకొచ్చి పోస్తున్న ధాన్యం

విజబుల్ పోలీసింగ్‌లో నిర్లక్ష్యం వహిస్తే సహించను

పనితీరు మార్చుకోని వారిపై కఠిన చర్యలు ● అధికారుల సమీక్షా సమావేశంలో ఎస్పీ హెచ్చరిక



పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): 'ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకం పెరగాలంటే విజబుల్ పోలీసింగ్‌ను బాధ్యతగా నిర్వహించాలి. ఈ విషయంలో కొందరు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వారు పనితీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవు' అని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. తిరుపతిలో మంగళవారం ఆయన జిల్లాలోని అదనపు ఎస్పీలు, డీఎస్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలతో మమేకమయ్యే కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా ఓపెన్ బూజింగ్, పరిసరాల పరిశుభ్రత, విజబుల్ పోలీసింగ్, పల్లెనిద్ర, ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం, పార్కుల్లో వాకింగ్ చేస్తున్న వృద్ధులతో పోలీసు కార్యక్రమాలను ప్రతిరోజు పక్కాగా నిర్వహించాలన్నారు. వీటిపై ఎలాంటి స్పందన వస్తోందనేది డీఎస్పీలను అడిగి తెలుసుకున్నారు. రాంగ్ రూట్‌లో వెళుతున్న వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తే వారు సంఘ వ్యతిరేక శక్తులుగా మారతారన్నారు. ప్రజలకు మనోధైర్యం కల్పించేలా పనిచేయాలే కానీ ఇబ్బంది పెట్టేవిధంగా కాదని పోలీసులకు సూచించారు. సబ్ డివిజన్ల పరిధిలో నమోదవుతున్న.. పెండింగ్ కేసులపై ఆరాతీశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు ఎందుకు ఛేదించలేకపోతున్నారని ప్రశ్నించారు. అన్ని దేవాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి దొంగతనాలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమయం దాటాక ఎవరైనా మద్యం తాగుతూ కనిపిస్తే పోలీస్ ట్రీట్‌మెంట్ గట్టిగా ఇవ్వాలన్నారు. నైట్‌బీట్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. శక్తి యాప్‌పై నిర్వహించే అవగాహన కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. త్వరలో సిబ్బందిని పారదర్శకంగా బదిలీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, రామకృష్ణ, డీఎస్పీలు, ఎస్బీ సీఐ షాదిక్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

తూలి కిందపడ్డ సూళ్లూరుపేట ఎమ్మెల్యే

- విజయశ్రీకి స్వల్ప గాయాలు
- శ్రీకాళహస్తి ఎమ్మెల్యే ఇంట్లో ఘటన

తడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తూలి కిందపడడంతో స్వల్ప గాయాలయ్యాయి. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో మంగళవారం జరిగిన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు విజయశ్రీ వెళ్లారు. కారుదిగి ఇంట్లోకి వెళ్తున్న క్రమంలో ప్రధాన గడప వద్ద తూలి కింద పడిపోయారు. ముఖం నేలకు కొట్టుకుని సల్ప గాయాలయ్యాయి. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వెంటనే వచ్చి విజయశ్రీని పైకి లేపారు. గాయమైన చోట రక్తం కారుతుండడంతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు కుట్లు వేసి చికిత్స అందించారు. కొద్దిసేపు అక్కడే విశ్రాంతి తీసుకున్న విజయశ్రీ సాయంత్రం నాయుడుపేటలోని స్వగృహానికి వచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆమెను పరామర్శించారు.

ప్రాణదాన పథకానికి 194 మంది ఎంపిక

తిరుపతి(వైద్యం),ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో నిరుపేదలకు ఉచిత శస్త్ర చికిత్సలు అందించే టీటీడీ ప్రాణదాన పథకానికి 194 మంది రోగులను ఎంపిక చేశారు.స్విమ్స్‌లో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో మంగళవారం ప్రాణదాన కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్డియాలజీ 1, కార్డియోథొరాసిక్ 18, ఈఎన్‌టీ 8, జనరల్ సర్జరీ 1, మెడిసిన్ 12, నెఫ్రాలజీ 39, న్యూరాలజీ 23, న్యూరోసర్జరీ 29, గైనకాలజీ 23, సైకియాట్రీ 1, సర్జికల్ ఆంకాలజీ ముగ్గురు రోగులను కమిటీ సభ్యులు ఎంపిక చేశారు. పేద రోగులకు ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహించే టీటీడీ ప్రాణదాన పథకానికి దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందిస్తే మరింత మందికి వైద్యం అందించే అవకాశం ఉంటుందని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ రామ్, వైద్య విభాగాధిపతులు శివశంకర్, గోపీ, నర్మద తదితరులు పాల్గొన్నారు.

నేడు అసెంబ్లీ పద్దుల కమిటీ రాక

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం అసెంబ్లీ పద్దుల కమిటీ రానుందని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ పద్దుల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావుతో పాటు 11మంది సభ్యుల బృందం బుధవారం ఉదయం 5.15గంటలకు తిరుపతి పద్మావతి అతిథి గృహం వద్దకు చేరుకుంటారన్నారు. 11గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి చిత్తూరు జిల్లాలో సమీక్షలో పాల్గొని రాత్రి 7.30గంటలకు తిరుమల చేరుకుంటారని తెలిపారు. గురువారం ఉదయం స్వామివారిని దర్శించుకుని 11.30గంటలకు తిరుపతి పద్మావతి అతిథిగృహంలో ఈవో శ్యామలరావు, ఇతర అధికారులతో సమీక్షా నిర్వహించి సాయంత్రం 5.15గంటలకు విజయవాడకు తిరుగు పయనం కానున్నట్లు కలెక్టర్ తెలిపారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'స్కిట్'ను పునఃప్రారంభిస్తాం

మరో ఆరు నెలల్లో రానున్న పది పరిశ్రమలు ● మెగా జాబ్‌మేళాలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): 'మరో 20 రోజుల్లో 'స్కిట్' (శ్రీకాళహస్తీశ్వరా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లో మరమ్మతులు ప్రారంభం కానున్నాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచి స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను పునఃప్రారంభిస్తాం' అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం శ్రీకాళహస్తిలో స్కిల్ డెవలప్‌మెంట్ సహాయంతో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. అభివృద్ధే ఆశయంగా తుది శ్వాస వరకు ప్రజల కోసం గోపాలకృష్ణారెడ్డి పరితపించారన్నారు. 30కి పైగా ఎంఎన్‌సీ కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ యువతకు స్థానిక పరిశ్రమల్లో 33శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ నెరవేరుస్తున్నామన్నారు. తొట్టంబేడు, శ్రీకాళహస్తి, మండలం, ఏర్పేడు, రేణిగుంటలో విస్తారంగా ప్రభుత్వ భూములున్నాయన్నారు. మరో ఆరు నెలల్లో సుమారు పది పరిశ్రమలు ప్రారంభించేలా మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపనతో అభివృద్ధి, ఉద్యోగాల కల్పనతో యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించాలన్న తపనతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టిసారిస్తున్నారని చెప్పారు. తరచూ సీఎం చంద్రబాబు కలెక్టర్ల సమావేశంలో కొత్త పరిశ్రమల కోసం భూముల పరిశీలన సాగిస్తూ ఎప్పటికపుడు యువతకు జాబ్‌మేళాల ద్వారా ఉద్యోగాలు ఇవ్వాలని సూచిస్తున్నట్లు తెలిపారు. త్వరలో జిల్లాస్థాయి జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. ఈ జాబ్ మేళాకు సుమారు రెండు వేల మంది నిరుద్యోగులు వచ్చారు. 1,788మంది 33ఎంఎన్‌సీ కంపెనీలకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 712మందికి అప్పటికప్పుడు నియామకపత్రాలు అందాయి. 305మంది దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ అధికార ప్రతినిధి గురవారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతినాయుడు, దశరథాచారి, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు చెంచయ్యనాయుడు, బొల్లినేని జగన్నాథంనాయుడు, మునిరాజానాయుడు, కంఠా రమేష్, రవీంద్రారెడ్డి, జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.





జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు - 2014-19లో సీఎం చంద్రబాబు, అప్పటి ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆధ్వర్యాన శ్రీకాళహస్తి నియోజకవర్గానికి తీసుకొచ్చిన పరిశ్రమలతో తయారు చేసిన జ్ఞాపికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పూలవనంలో జెర్రిపోతు



తిరుమల, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శ్రీవారిసేవా సదన్‌కు సమీపంలోని పూలవనంలోకి ఏడు అడుగుల పొడవైన జెర్రిపోతు ప్రవేశించింది. గుర్తించిన కార్మికులు వెంటనే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచారు. ఆయన పామును చాకచక్యంగా పట్టుకుని అడవిలో విడిచిపెట్టాడు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లాను సన్మానిస్తున్న ఎంపీడీవో ప్రమీలారాణి, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, అధికారులు

పెళ్లకూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం పెళ్లకూరు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యపై ఫిర్యాదు అందగానే చర్యలు చేపట్టి పరిష్కరించాలని ఎంపీడీవో ప్రమీలారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. జీలపాటూరు సర్పంచు, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వేతో గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కారం కాకపోగా మరెన్నో సమస్యలు ఉత్పన్నమయ్యాయని వాపోయారు. రీసర్వే లోపాలను సరి చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని వాపోయారు. కూటమి ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. అధికారులు తక్షణం స్పందించి భూసమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం దేశంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు హర్యానాలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో పాల్గొని తిరిగి వచ్చిన జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లాను ప్రజా ప్రతినిధులు, అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సుధారాణి, బెల్లపు రవిరెడ్డి, ఏవో ప్రవీణ, సీడీపీవో ఉమామహేశ్వరి, ఎంఈవో మించల శంకరయ్య, హౌసింగ్ ఏఈ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగిఉండాలి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

గూడూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి వుండాలని చెన్నూరు పీహెచ్‌సీ డాక్టర్ జ్యోతి అన్నారు. మంగళవారం మండలంలోని నెల్లటూరు గ్రామంలో స్విమ్స్ ఆస్పత్రి సహకారంతో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే సులభంగా నయం చేసుకోవచ్చునన్నారు. ప్రభుత్వం ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నాగరాజు, చైతన్యభాను, పద్మావతి, నగేష్‌రెడ్డి, మస్తానయ్య, రమేష్‌బాబు, ఉమా తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



గూడూరు డిపోలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గూడూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక పాతబస్టాండు, ఆర్టీసీ డిపో, గిరిజనకాలనీ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపకశాఖ అధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ అగ్నిప్రమాదాల సంభవించినపుడు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంజినాయుడు, ప్రదీప్, శ్రీనివాసులు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్ వద్ద అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక అధికారి డీవీ రమణయ్య అవగాహన కల్పించారు. వంట గదుల్లో గ్యాస్ సిలిండర్లకు కాలం చెల్లిన పైపులను వాడరాదని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది చంద్రబాబు, సందీప్ నాగరాజు, పోలయ్య, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని ఆర్టీసీ సెంటర్‌లో అగ్నిమాపక అధికారి హరీష్ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు జరిగాయి. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హఠాత్తుగా సిలిండర్ పేలితే తక్షణం తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు. వేసవిలో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది దుర్గాప్రసాద్, నాగరాజు, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపక అధికారి నారాయణ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఎన్‌జేఆర్ సర్కిల్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని శివానీకి మంత్రి లోకేశ్ అభినందన



శివానీకి లాప్‌టాప్ అందజేస్తున్న మంత్రి నారా లోకేశ్

కోట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కోటలోని ఏవీకేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని శివాని ఎంపీసీలో 978 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. మంగళవారం గుంటూరు జిల్లా ఉండవల్లిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన 52మంది విద్యార్థినులను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అభినందించారు. ఈ సందర్భంగా శివానీకి మెడల్‌తో పాటు లాప్‌టాప్ బహూకరించారు.

పని దినాలు, వేతనాల పెంపు హర్షణీయం

గూడూరు అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిదినాలను 100 రోజుల నుంచి 150 రోజులకు, కూలీల వేతనం రూ.300 నుంచి రూ.400 వరకు పెంచుతూ పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేయడం హర్షణీయమని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి హర్షవ్యక్తం చేశారు. పార్లమెంటరీ కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

మూడు సవర్ల సరుడు అపహరణ

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లోతువానిగుంట వద్ద మహిళ మెడలో నుంచి మూడు సవర్ల సరుడు లాక్కెళ్లిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. లోతువానిగుంటలో నివాసం ఉంటున్న తులసి సమీపంలోని దుకాణానికి నడిచి వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తి మోటరు సైకిల్‌పై వచ్చిన ఆమె మెడలో ఉన్న మూడు సవర్ల సరుడు లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

50 శాతం వడ్డీ రాయితీతో నెలాఖరు వరకు పన్నులు చెల్లించవచ్చు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నులను 50 శాతం వడ్డీ రాయితీతో ఈనెలాఖరు వరకు చెల్లించవచ్చునని కమిషనర్ చిన్నయ్య తెలిపారు. అదే విధంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి ముందస్తు ఇంటి పన్నులు 5శాతం రాయితీతో చెల్లించవచ్చన్నారు.

దొంగ పట్టాలతో ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో కొందరు ప్రభుత్వ భూములకు దొంగ పట్టాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని కౌన్సిలర్ శంకరయ్య ఆరోపించారు. మంగళవారం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లిన ఆయన అక్కడ జరుగుతున్న రిజిస్ట్రేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు.



జాతీయ రహదారి పక్కన ఉన్న పోగేసిన చెత్త - 15 ఎస్‌పేట 2, డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగ

డంపింగ్ యార్డుతో పొంచివున్న ముప్పు

పట్టణ నడిబొడ్డున చెత్త పోగేయడంతో ఇబ్బందులు ● పట్టించుకోని పాలకులు, అధికారులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణానికి డంపింగ్ యార్డుతో ముప్పు పొంచిఉంది. పట్టణ నడిబొడ్డున జాతీయ రహదారి పక్కన కాళంగి నదిని ఆనుకొని చెత్త డంపింగ్ చేస్తుండడంతో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో 56 వేలకు పైగా జనాభా ఉంది. ప్రతిరోజూ దాదాపు 30 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇదంతా హోలిక్రాస్ సమీపంలో జాతీయ రహదారి పక్కన డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అక్కడ నుంచి దుర్వాసన వెదజల్లుతుండడంతో పట్టణం కాలుష్య కోరల్లో చిక్కుకొంటోంది. తరచూ డంపింగ్‌యార్డులో మంటలు సంభవించి పొగ పట్టణాన్ని కమ్మేస్తోంది. పొగ పీల్చడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇదే కాకుండా డంపింగ్ యార్డు నుంచి చెత్త చెదారం పక్కనే ఉన్న కాళంగిలోకి చేరి సాగునీరంతా కలుషితమవుతోంది.

డంపింగ్ యార్డుకు స్థల సమస్య

సూళ్లూరుపేట పంచాయతీగా ఉన్నప్పుడు కాళంగి నది పక్కన డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ స్థాయికి ఎదిగినా చెత్తంతా అక్కడే వేస్తున్నారు. డంపింగ్ యార్డును పట్టణానికి దూరంగా తరలించాలని గత పదేళ్ల నుంచి అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు. రెండు, మూడు చోట్ల స్థలాన్వేషణ చేసిన కార్యరూపం దాల్చలేదు. మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారుల నడుమ సమన్వయం లేకపోవడంతో స్థల సేకరణ జరగలేదు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని డంపింగ్ యార్డుకు స్థలం సేకరించి మార్చాల్సిన అవసరం ఉంది.

ఉపాధి పనులు చేయకనే బిల్లులు



టెక్నికల్ అసిస్టెంట్‌ను ప్రశ్నిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

కోట, ఏప్రిల్ 15: కోట మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. 2023 - 24 సంవత్సరంలో మండలంలోని 21 పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనుల వివరాలను డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, ఏపీడీ వరప్రసాద్ సమక్షంలో జిల్లా

ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్ల సస్పెన్షన్

రిసోర్స్ పర్సన్లు వెల్లడించారు. పలువురు టెక్నికల్ అసిస్టెంట్లు రోడ్లకు ఇరువైపులా, పంచాయతీల్లో మొక్కలు నాటకపోయినప్పటికీ మస్టర్లు తయారు చేసి బినామీ పేర్లతో నిధులు స్వాహా చేశారని తేలింది. అంతేకాకుండా ఉపాధి పనుల వద్ద నేమ్ బోర్డులు పెట్టకుండా, ప్రింటెడ్ రికార్డులు లేకుండా మస్టర్లు తయారు చేసినట్లు వెల్లడైంది. అదేవిధంగా మినీ గోకులాన్ని లబ్ధిదారుడికి కాకుండా వేరొకరికి కట్టించినట్లు వెల్లడించారు. గూడలి పంచాయతీలో 400 మొక్కలు నాటినట్లు, కొన్ని పంచాయతీల్లో కొలతలు తక్కువ చూపి ఎక్కువ నగదు డ్రా చేసినట్లు తేలింది. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడిన టెక్నికల్ అసిస్టెంట్లు శాంతి, ఏవీ భాస్కర్‌లను సస్పెండ్ చేస్తున్నట్లు పీడీ తెలిపారు. అదేవిధంగా ఏపీవో పూర్ణిమను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా బదిలీ చేసే యోచనలో ఉన్నట్లు చెప్పారు. పలు పంచాయతీల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి రూ4.50 లక్షలు రికవరీ చేస్తున్నామని పీడీ తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం: పాశం



రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

గూడూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఆవరణలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రాయితీపై వ్యవసాయ పరికరాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. రాయితీపై వ్యవసాయ పరికరాలను కూడా అందించలేదన్నారు. తమ ప్రభుత్వం నియోజకవర్గ పరిధిలో రైతులకు దాదాపు 103 పరికరాలను రూ.17.68 లక్షల రాయితీతో అందించడం జరిగిందన్నారు. అందులో రోటావేటర్లు, పవర్ స్ప్రేయర్లు, కల్టివేటర్లు తదితర పరికరాలు ఉన్నాయన్నారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందించిన పరికరాలను సద్వినియోగం చేసుకుని అధిక లాభాలను ఆర్జించాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురాజు, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, మట్టం శ్రావణి, శ్రీనివాసులురెడ్డి, రాఘవరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కిషోర్‌నాయుడు, వాటంబేడు శివ కుమార్, జలీల్ ఆహ్మద్, వ్యవసాయశాఖ ఏడీ గోపినాయక్‌రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ఓజిలి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తల్లులు తమ గర్భస్థ దశనుంచి పిల్లలకు రెండేళ్ల వయసు వచ్చేవరకు సంరక్షణపై దృష్టి పెట్టాలని కురుగొండలోని ఆయుర్వేద వైద్యురాలు మంజుల అన్నారు. ఓజిలి మండలం కురుగొండలోని ఎస్టీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జరిగిన పౌష్టికాహార పక్షోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. పౌష్టికాహారం, పిల్లల పోషణ, సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ సుజన, మహిళా సంరక్షణ కార్యదర్శి భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుహాసిని, అనూష, రాజేశ్వరి పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన సర్పంచు

ఓజిలి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం చిలమానుచేను సర్పంచు, వైసీపీ నేత పారిచర్ల సాయిరాం మంగళవారం బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి సమక్షంలో సర్పంచుతో పాటు దాదాపు 50మంది గ్రామస్థులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బిల్లు పవన్ కుమార్, వరప్రసాద్, రవీంద్రరాజు, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

గూడూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో మంగళవారం అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ చేశారు. రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ వేసవి కాలంలో రైలు ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ట్రస్ట్ అధ్యక్షుడు తాజుద్దీన్ ముందుకు వచ్చి మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

ఆక్రమణల తొలగింపు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీఎస్ రోడ్డులోని కోదండ రామాంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన స్థలంలో అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డును దేవదాయశాఖ సిబ్బంది మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో నవీన్‌కుమార్ మాట్లాడుతూ కోదండ రామాంజనేయస్వామి ఆలయ స్థలంలో కొంత భాగంపై కోర్టు కేసు నడుస్తోందన్నారు. అయితే కొందరు అక్రమణలకు ప్రయత్నించగా పోలీసులకు ఫిర్యాదు చేసి వాటిని తొలగించడం జరిగిందన్నారు.

19న రన్ ఫర్ జీసస్

కోట, ఏప్రిల్ 15: కోట పట్టణం ఎన్‌సీఆర్ నగర్‌లోని బరకా ఆరాధన మందిరంలో మంగళవారం రన్ ఫర్ జీసస్ ఫ్లెక్సీల ఆవిష్కరణ జరిగింది. క్రైస్తవ సంఘాల ఐక్యత, యువతను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించడానికి ఈనెల 19న వాకాడు నుంచి కోట క్రాస్ రోడ్డు వరకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో దినకర్‌బాబు, నోవాబాబు, ప్రభాకర్, రత్నం, శ్యామసుందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి

వెంకటగిరి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మండలం పెట్లూరు పంచాయతీ పరిధిలోని సీతారామ్ ఏచూరి నగర్‌లో నివాసం ఉంటున్న దళిత, గిరిజన కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారు రామ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజయ్య, దొరబాబు, వెంకటయ్య, నాగమణి, నాగరాజు, పెంచలయ్య, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

కోట, ఏప్రిల్ 15: కోట దళితవాడలో మంగళవారం తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ హరిత, డాక్టర్ నాగరాజు, సిబ్బంది సంధ్య, రమేష్ ఆధ్వర్యంలో మహిళలకు మమోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు. పలువురికి మందులను పంపిణీ చేశారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, ఏప్రిల్ 15: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం పలువురు విద్యార్థులను అభినందించారు. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు కడపలోని కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో క్రీడా పోటీలు జరిగాయి. బాస్కెట్ బాల్, కబడ్డీ, బాల్ బాట్మింటన్ పోటీల్లో ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు, షీల్డులు, మెమెంటోలు అందుకున్నారు. వారిని మంగళవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లిఖార్జునరెడ్డి, ఆయా విభాగాధిపతులు అభినందించారు.

అశ్వవాహనంపై శ్రీరాముడు

గూడూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటిమిట్టలోని కోదండ రామాంజనేయస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉదయం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి విశ్వక్సేనా ప్రార్థన, మూర్తి హోమం, బలిహరణ, తిరుచ్చి ఉత్సవం జరిపారు. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అశ్వవాహనంపై ఉంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. ఇందిరమ్మ, బాబాప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

సంగమేశ్వరుడు..

కోట, ఏప్రిల్ 15: మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి సంగమేశ్వరుడు, కామాక్షీదేవి అమ్మవార్లు అశ్వవాహనంపై ఊరేగారు. అనంతరం స్వామి, అమ్మవార్లు గూడలి పురవీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగారు. భక్తులు స్వామివారికి అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

వెంకటగిరి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, సుబ్బరత్నమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా ఈశ్వరయ్యస్వామి తెప్పోత్సవం



పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

డక్కిలి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన దేవునివెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్యస్వామి తిరునాళ్లల్లో భాగంగా మంగళవారం రాత్రి శివ పార్వతుల తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. మంగళవాయిద్యాలు, మేళతాళాలు, గిరిజ నృత్యాల నడుమ స్వామివారి తేప్పోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లు కోనేరులో తెప్పపై మూడుసార్లు విహరించారు. అనంతరం చప్పరంపై నుంచి భక్తులకు దర్శనమిచ్చారు.

తిరునాళ్ల రాబడి రూ.7,69,235

స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి తిరునాళ్లలో మెత్తం రూ.7,69,235 లక్షలు ఆదాయం వచ్చింది. హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకుల ద్వారా రూ.3,67,135, ప్రత్యేక దర్శన టికెట్లు ద్వారా రూ.71 వేలు, తలనీలాల టికెట్లు ద్వారా రూ.19,850, స్వామివారి కల్యాణం చదివింపుల ద్వారా రూ.1,20,768, అభిషేకం టికెట్లు ద్వారా రూ.4,750, ఉభయ కట్నాల ద్వారా రూ.45 వేలు, అన్నదాన విరాళాలు రూ.91,840 వేలు ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీనివాసులు నాయుడు తెలిపారు.

నీటితొట్టెలను త్వరితగతిన పూర్తి చేయండి



నీటి తొట్టె పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

చిల్లకూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పశువులు నీళ్లు తాగేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకం కింద నిర్మిస్తున్న నీటి తొట్టెలను త్వరితగతిన పూర్తి చేయాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని తిప్పగుంటపాళెం గ్రామంలో నిర్మిస్తున్న నీటి తొట్టెలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పశువులు నీళ్లు తాగేందుకు మండలంలో 48 తొట్టెలను నిర్మించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. తొట్టెల నిర్మాణాలను రెండు, మూడు రోజుల్లో పూర్తిచేసేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని ఉపాధి పనుల వద్ద కూలీలకు మంచినీరు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం పారిచెర్లవారిపాళెం వద్ద ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ చంద్రశేఖర్ రాజు, ఏపీవో గిరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా సీతారాముల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి మహోత్సవాల్లో భాగంగా మన్నారుపోలూరు అలఘు మల్లారి కృష్ణస్వామి ఆలయంలో మంగళవారం సీతారాముల కల్యాణం వేడుకగా జరిగింది. ముందుగా ఆలయ ప్రాంగణంలో ఉన్న రామాలయం ఎదురుగా సీతారాముల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ పండు వెన్నెల్లో సీతారాముల కల్యాణం నేత్రానంద శోభితంగా జరిగింది.

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, పెళ్లకూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్, ఆయన సతీమణి భారతిపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని నాయుడుపేట, పెళ్లకూరు మండలాల పోలీస్ స్టేషన్లలో వైసీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. నాయుడుపేటలో సీఐ బాబీకి వైసీపీ నేతలు మాధవరెడ్డి, కిషోర్ యాదవ్, హరినాథ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కటకం జయరామయ్య, లక్ష్మీప్రసన్న కుమార్ రెడ్డి, రత్నశ్రీ ఫిర్యాదు చేయగా, పెళ్లకూరు ఎస్ఐ నాగరాజుకు జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, వైఎస్ ఎంపీపీ ఇలకా సుధారాణి ఫిర్యాదు చేశారు.